# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

**గూడూరి వెంకటరత్నం**
**డి.జె. బాలకృష్ణ లాల్**
**డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి**
**మిస్.పి. ఇందిరాదేవి**
**జి.ఎస్.ఆర్. మూర్తి**
**డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు**
**డా॥ యమ్.స్వర్ణముఖి**

Volume 29 Issue 10
No.of Pages 44
JUNE 2010

| | | |
|---|---|---|
| 5సం॥ల చందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్స్ పంపవలసిన చిరునామా:

మేనేజరు
సమర్థసద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,

**ఈ సంచికలో....** **పేజీ**

| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మ ఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| బాబూజీ ఉవాచ | 6 |
| మాతాజీ అభిభాషణ | 9 |
| సన్నిధిలో సంభాషణ | 12 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 15 |
| సత్సంగ సౌరభం | 16 |
| సంత్ నామదేవ్ చరితామృతం | 18 |
| శ్రీకృష్ణతత్వము ప్రేమయోగము | 21 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 23 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 25 |
| మాతాజీ బోధామృతం | 27 |
| మాతాజీ సత్సంగ్ డైరీ | 29 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 31 |
| సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర | 33 |
| గురు మహిమ | 36 |
| నీవు వినలేని పిలుపే లేదు | 38 |
| ప్రయాణకాలే z పిచ మాం | 40 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 42 |

# భద్రవాక్యం

**శ్లో॥ బోధో Z న్య సాధనే భ్యోహి సాక్షాన్మోక్షైక సాధనమ్ ।**
**పాకస్య వహ్నివద్ జ్ఞానం వినామోక్షో న సిద్ధ్యతి ॥** ( - ఆత్మబోధ)

ఇది శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్య విరచిత ఆత్మబోధ అనే ప్రకరణ గ్రంథంలోని రెండవ శ్లోకం. మొదటి శ్లోకంలో అనుబంధ చతుష్టయమును చెప్పి, అవతారిక అయిన ఈ రెండవ శ్లోకంలో, అన్య సాధనములు ఎన్ని ఉన్నా, మోక్షానుభవమునకు బోధ ఒక్కటే ఏకైక సాధనమని, నిప్పులేనిదే వంటకము ఎలా తయారుకాదో, అదే విధముగా జ్ఞానము లేకుండా మోక్షము సిద్ధించదు అని ఆచార్యులవారు బోధయొక్క ఆవశ్యకతను వివరిస్తున్నారు.

అద్వైత సిద్ధాంతానుసారం అద్వితీయ బ్రహ్మము తప్ప అన్యమైనది లేదు. అది నిత్యముక్తము. మోక్షము నిత్య సిద్ధము. అది కర్మలవలన సాధింప బడేదికాదు. మరి జ్ఞానం వినా మోక్షో న సిద్ధ్యతి అని ఆచార్యులవారు ఎవరికి చెప్తునట్లు? ఎందుకు చెప్తునట్లు?

కళ్ళజోడు ముఖానికే ఉన్నా అది గుర్తుండక, ఆ కళ్ళజోడు కోసం ఇల్లంతా వెతికే వారివలె, హారం మెడలోనే ఉండగా దాని విస్మృతి వలన ఆ హారం కోసం ఇల్లంతా గాలించేవారివలె (ఇవి రెండూ ఎందరికో ప్రత్యక్ష అనుభవాలే) తాము నిత్యముక్తులే అయి ఉండీ దాని విస్మృతి వలన ఆ ముక్తి తమకంటే భిన్నంగా ఉన్నదని, ఆ ముక్తికోసం ఎక్కడెక్కడికో పరుగులెత్తే వారి కోసమే ఇది చెప్పబడింది.

కట్టెలూ, గిన్నెలూ, నీళ్ళవంటివి ఎన్ని ఉన్నా అగ్ని (ఏదో ఒక రూపంలో ఉష్ణశక్తి) లేకుండా బియ్యం ఎలా పచనం అయి అన్నం కాదో, అన్నం కావటానికి అలా అగ్ని ఏ విధంగా ఏకైక సాధనమో, అలాగే కర్మయోగము, భక్తియోగము, పతంజలి అష్టాంగయోగము మొదలైన మార్గాలు ఎన్ని ఉన్నా, తాను నిత్య ముక్తుడు అన్న సత్యము యొక్క విస్మృతి, అజ్ఞానము, అవిద్య అనే బంధాన్ని విడిపించటానికి వాటికి సాధ్యం కాదు. భక్తిలో మోక్షాన్ని కోరటమే ఉండదు. భక్తుడు నిరంతరం ఏదో ఒక భావనతో తనను భగవంతునితో బంధించుకొని ఉంటాడు. నిష్కామ కర్మవల్ల చిత్తశుద్ధి కలుగుతుంది. ఇక యోగం వలన చిత్తవృత్తులు నిరోధింపబడి, మనస్సు నిశ్చలమై జ్ఞాన నిష్ఠకు అర్హతను పొందుతుంది. ఇవన్నీ అంతవరకే. ఒక్క జ్ఞానానుభూతితో మాత్రమే తాను మొదటనుండి నిత్యముక్తుడనే అనే అనుభూతి కలుగుతుంది.

అందువలననే, అట్టివారికి మోక్షసిద్ధికి ఆత్మజ్ఞానమొక్కటే ఏకైక సాధనం అని ఆచార్యులవారు సెలవిస్తున్నారు. *

# అమ్మ ఆశీస్సులు

నవవిధభక్తులలో దాస్యభక్తి ఎంతో గొప్పది. ఆంజనేయస్వామివారిది దాస్యభక్తి. మనం చిన్నగాఉంటే సాధనలో ముందడుగు వేయగలుగుతాం. వరద వస్తే చిన్నమొక్కైతే క్రిందకు వంగి వరద తగ్గగానే అది పైకి లేస్తుంది. అదే మానైతే వరద వేగానికి విరిగి కొట్టుకుపోతుంది. ఆంజనేయస్వామి ఒక్కసారి 'రాం' అనేసరికి ఆయన రోమాల ద్వారా ముప్పదిమూడుకోట్ల 'రామ' నామం జరిగిపోయేది. అని శ్రీ గురుమహరాజ్ అనేవారు. ఎక్కడెక్కడ రామనామ సంకీర్తన జరుగుతుంటుందోఅక్కడ మారుతి బాష్పపూరిత నయనాలతో అంజలి ఘటించి నిలబడి ఉంటాడు.

మనం రామనామం ఎంత చేస్తున్నాము? పోనీ గురునామం చేస్తున్నామా? 'రామ తారక మంత్రం' వాల్మీకిని తరింపచేసి ఆదికవిగా మార్చింది. 'రామ' అనే మంత్రాన్ని జపిస్తే కోరికలన్నీ తీరతాయి. పాతకాలు హరిస్తాయి. చిత్తశాంతి లభిస్తుంది. పాటలో చెప్పినట్లుగా-

నారాయణ మంత్రములో 'రా' బీజము,
పంచాక్షరి మంత్రములో 'మ'బీజము
రెండక్షరాల సంపుటియగు అక్షరబ్రహ్మమైన
శ్రీరామ నామమే రాజీవము ప్రాణ రాజీవము
రామ రామ అంటేనే చాలదా- కామితములు తీరగా,
తామసములు తొలగగా...

శ్రీ బాబూజీ మహరాజ్‌వారు శ్రీరామమంత్ర మహిమ గురించి చెప్తూ, నారాయణ మంత్రంలో 'ర' తీసివేస్తే 'నాయనాయ' అవుతుంది అలాగే పంచాక్షరి మంత్రంలో 'మ' తీసివేస్తే 'నశివాయ' అవుతుంది. ఈ మంత్రాలు అర్థరహితమైపోతాయి అన్నారు.

సీతారామాంజనేయ సంవాదంలో సీతాదేవి ఆంజనేయుడికి 'రాముడు అంటె దశరథపుత్రుడు కాడు. రాముడు నిర్వికారుడు, నిరామయుడు, అవ్యయుడు, నిష్కాముడు, అజుడు, అకర్త, అభోక్త అయిన అంతరారాముడు, కావున రాముని మానవునిగా చూడరాదు' అని బోధిస్తుంది. గురుదేవులు కూడా అనంతుడు, సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపకుడు అయిన పరబ్రహ్మమే కాని వేరుకాదు. అదేవిధంగా ఆత్మ అంటే ఈ భౌతిక దేహంకాదు. సమర్థులైన గురుదేవులను ఆశ్రయించి సేవిస్తేగాని ఈ సూక్ష్మాలు తెలుసుకోలేము.

ఈ నెల 2వతేదీన శ్రీమహాకాళికాపరమేశ్వరీ సహిత శ్రీ రామలింగేశ్వరస్వామి వారి 29వ ప్రతిష్ఠా వార్షికోత్సవ వేడుకలు జరుగుతవి, ఈనెల 7 వతేదీన శ్రీ హనుమజ్జయంతి అంటే హనుమంతుని పుట్టినరోజు. హనుమజ్జయంతి ఉత్సవాలు ఆశ్రమంలోను, పెదనింద్రకొలను శాఖలోను అత్యంత వైభవంగా జరుగుతవి. భక్తులందరూ ఈ పర్వదినాలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుని తరింతురు గాక! సుఖీభవ! సుఖీభవ!!

- మీ అమ్మ

# సంపాదకీయం

అవి ఇంకా విద్యుచ్ఛక్తి రాకపూర్వం రోజులు. పెద్దయ్య ఒక జైలులో కాపలాదారుగా పనిచేస్తూఉండేవాడు. ప్రతిరోజు రాత్రి జైలులో అన్ని సెల్స్ తాళాలు వేసి ఉన్నాయా, ఖైదీలందరు ఉన్నారా, లేరా అని తణిఖీ చేయటం అతడి డ్యూటీ. అంతా కటిక చీకటిగా ఉంటుంది, పాములు, తేళ్ళు తిరుగుతుంటాయి అని ప్రభుత్వంవారు అతనికి ఒక లాంతరు, లాఠీ శాంక్షన్ చేశారు. లాంతరుతో గదుల తాళాలను, లోపలి ఖైదీలను చూస్తూ, లాఠీతో నేలమీద కొట్టి చప్పుడు చేస్తూ గస్తీ తిరుగుతుండేవాడు పెద్దయ్య.

ఒకరోజు జైలు సూపరింటెండెంట్ పరివారంతో సహా తనిఖీకి వచ్చాడు. పొద్దుపోయి వర్షం పడుతున్నందున నిద్ర రాక అక్కడే ఆఫీసు రూమ్‌లో వాళ్ళందరూ బాతాఖానీ కొడుతూ కూర్చున్నారు. పెద్దయ్య అప్పటికే రెండు రౌండ్లు తిరిగాడు. తప్పదుకదా! కాళ్ళీడ్చుకొంటూ మూడో రౌండుకు బయల్దేరాడు. బద్ధకంగా ఉంది. దానికి తోడు బయట చల్లని వాతావరణం. పెద్దయ్యకు బీడీ కాల్చుకుంటే బాగుండుననిపించింది. జేబులోనుంచి బీడీ కట్టతీసి ఒక బీడీ నోట్లో పెట్టుకున్నాడు. జేబులు తడిమి చూశాడు. అగ్గిపెట్టె లేదు.

ఒక సెల్‌లో ఖైదీని లేపి 'అగ్గిపెట్టె ఉందిర్రా?' అని అడిగాడు. వాడు 'మా దగ్గర అగ్గిపెట్టెలుకూడా ఉండనిస్తావా నీవు. చాల్చాల్లే పో' అని విసుక్కుని పడుకొన్నాడు. పెద్దయ్య ఇంకో సెల్‌లో వాణ్ణి లేపాడు. వాడు బద్ధకంగాలేచివచ్చి చువ్వలలోనుండి లాంతరు వెల్తురులో పెద్దయ్యను గుర్తుపట్టి 'ఏంది పెద్దయ్యా?' అని అడిగాడు. ఒరేయ్! బీడీ కాల్చుకోవాలిరా, అగ్గిపెట్టుందా?' అడిగాడు పెద్దయ్య. ' నేను బీడీలు, సిగరెట్లు కాల్చను పెద్దయ్యా! నా దగ్గర అగ్గిపెట్టె ఎందుకుంటుంది?' అని వాడు వెళ్ళి పడుకొన్నాడు. పెద్దయ్యకు నీరసం వచ్చింది.

అంతలో పెద్దయ్యకు ఇంకా ఆఫీసులోనుండి పెద్ద పెద్దగా మాటలు, మధ్య మధ్యలో ఛలోక్తులు వినిపించినై. వాళ్ళ దగ్గర అగ్గిపెట్టె తప్పక దొరుకుతుంది. అయినా అంత పెద్దవాళ్ళను అగ్గిపెట్టె అడగటం ఎలా? పెద్దయ్య సందేహించాడు. కాని చివరకు బీడీ కాల్చుకోవాలి అన్న తీవ్రమైన అతడి కోరిక అతని సందేహంపై విజయం సాధించింది. ఇక తప్పదు అనుకుంటూ పెద్దయ్య మెల్లగా వాళ్ళ దగ్గరకెళ్ళాడు.

సూపరింటెండెంట్ అతణ్ణి పలకరించి 'ఏం పెద్దయ్యా! ఇట్లా వచ్చావు? పోనీ కాసేపు పడుకుంటావా?' అన్నాడు. 'అమ్మో! డ్యూటీలో ఉండగా పడుకోవటమే! అయ్యగారూ! అది మాత్రం నా వల్లకాదు' అన్నాడు పెద్దయ్య. 'అయితే పోనీ కొంచెం టీ త్రాగు, కాస్త హుషారు వస్తుంది' అన్నాడు సూపరింటెండెంట్. పెద్దయ్య 'వద్దయ్యగారూ!' అన్నాడు. పెద్దయ్య సంకోచిస్తుండటం చూసి సూపరింటెండ్. 'ఏం కావాలి పెద్దయ్యా? ఫరవాలేదు చెప్పు' అని ధైర్యం ఇచ్చాడు. పెద్దయ్య'చాలా సేపటినుంచీ బీడీ కాల్చుకొందామని పురపురగా ఉంది. దగ్గర అగ్గిపెట్టె లేదు. అందుకని ఇక్కడ ఎవరి దగ్గరైనా అగ్గిపెట్టుంటే ....' మెల్లగా వినీవినపడనట్లు నసిగాడు పెద్దయ్య.

సూపరింటెండెంట్ ఒకసారి పెద్దయ్యను పైనుంచి క్రిందకు ఎగాదిగా చూసి 'ఒరేయ్ పెద్దయ్యా! అప్పటినుంచి ఆ లాంతరు నీ చేతిలోనే ఉందికదా! దానికి బీడీముక్క అంటించుకుంటే సరిపోయేదికదా!ఇంత బాధపడేకంటే' అన్నాడు.

పెద్దయ్య 'హయ్యో!నామతిమండా ! ఇన్నాళ్ళబట్టీ లాంతరు నా చేతిలోనే ఉన్నది. దానితో బీడీ అంటించుకోవచ్చు అన్న సంగతి ఇంతవరకూ నాకు గుర్తే తగల్లేదు' అనుకొని సూపరింటెండెంట్‌కు నమస్కారం చేసి ఇవతలికి వచ్చి లాంతరుతో బీడీ వెలిగించుకొని హుషారుగా గుండెల నిండా లోపలికంటా ఒక దమ్ము పీల్చి రైలింజను వదిలినట్లు పొగ బైటకు వదిలిపెట్టాడు. ఇప్పుడు పెద్దయ్యకు స్వర్గలోకంలో తేలిపోతున్నంత హాయి అనిపించింది.

మనం స్వస్వరూప బ్రహ్మానుభూతిని పొందటానికి చేయవలసిన సాధన మనలోనే, మనతోనే ఉన్నది, పెద్దయ్య చేతిలో లాంతరు ఉన్నట్లే. అయినా పెద్దయ్యకు అవసరానికి ఆ లాంతరు గుర్తురానట్లే, మనకు కూడా విస్మృతి వలన అది గుర్తు రాదు. సూపరింటెండెంట్ పెద్దయ్యకు లాంతరు సంగతి గుర్తు చేసినట్లే మనకు మన సాధన మార్గం చూపి, గుర్తు తెలిపేవాడే గురుదేవుడు. గుర్తు చేసినా ఆనందం కలగాలంటే పెద్దయ్యే ఎలా బీడీ వెలిగించుకొన్నాడో, అలా గురుదేవులు మార్గం చూపినా మన సాధన మనమే చేయాలి. గురుదేవులు చెప్పింది చెప్పినట్లు సాధన చేస్తే బ్రహ్మానందం మన సొత్తు. మన స్వరూపం సచ్చిదానందమన్న అనుభూతి కలిగి తీరుతుంది.

సద్గురుదేవులు మనందరికీ గుర్తు తెలిపి, మన సాధన సఫలీకృతమై, మనమందరము స్వస్వరూప బ్రహ్మానందానుభూతిలో ఓలలాడేలా, తమ కృపామృతమును మనందరిపై వర్షించెదరుగాక! - గౌరవ సంపాదకుడు

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

మానవుడు ఎప్పుడూ ముక్కు మూసుకొని, జపమాల త్రిప్పుతూ కూర్చోనక్కరలేదు. అలా కూర్చున్నంత మాత్రం చేత, జపమాలను చేతులతో అరగదీసినంత మాత్రంచేత, అది ధ్యానమూ కాదు. తన నిత్య నైమిత్తిక కర్మలను మానవుడు తప్పకుండా శ్రద్ధగా ఆచరించాలి. అలా ఆచరిస్తూనే భగవన్నామాన్ని ఉచ్చరించినా చాలు, లేదా మనసులో నిలుపుకోవచ్చు. ఇక మిగిలిన కాలాన్ని ధ్యానానికో, సంకీర్తనకో, సత్సంగానికో వినియోగించవచ్చు. కాని తనకు మిగిలిన కాలాన్ని మానవుడు ఎన్నో వ్యర్థ కాలక్షేపాలకు వినియోగిస్తాడు. "అయినా ఫరవాలేదు. అలా వ్యర్థ కాలక్షేపం చేస్తూ కూడా అవి మానకుండానే నా నామాన్ని మనస్సులో నిలుపుకో. వాటివల్ల నీకు చెరుపు కలగకుండా రక్షణ కలుగజేస్తాను" అంటాడు భగవానుడు. "పోనీ అదీ చేతగాకపోతే నేను ఉన్నానని విశ్వసించు; ఆ విశ్వాసాన్ని చెదరకుండా నిలుపుకో, చాలు" అంటాడు. రూప, నామ, క్రియారహితమైన ఒక అనంతశక్తి ఉన్నదని, అదే నీకు అనుక్షణము నీ కార్యకలాపాలను నిర్వహించే శక్తినిస్తున్నదని గాఢంగా విశ్వసించు. ఆ విశ్వాసమే నిన్ను సర్వదా రక్షిస్తుంది.



భగవంతుని యందు గాఢ విశ్వాసం గల మానవుడు ఎన్నడూ తప్పు చేయడు, చేయలేడు. పరమాత్మ ధ్యానంలో అలా నిన్ను సత్యమార్గంలో నడిపే శక్తి ఉంది. కరెంటుకు తీగను తాకిస్తే, ఆ తీగలోనికి కరెంటు శక్తి ఎలా ప్రవహిస్తుందో, అలాగే భగవంతుని పాదాలకు తాకించిన మనస్సులో గొప్ప శక్తి ప్రవేశిస్తుంది. అది డబ్బు వల్ల వచ్చేది కాదు. ఎంత డబ్బు సంపాదించినా అది నిలిచేది కాదు. ధనం ఉన్న కాసేపూ, అశాంతి, దాయాదుల భయమూ, దొంగల భయమూ, Income Tax భయమూ. అలాగని ధనం సంపాదించ వద్దని కాదు, ధనం లేకపోతే జగతి నడవదు. దానిని వదులుకోమని కాదుగాని, అది అనిత్యమని గ్రహించి, దానిని సంపాదించే శక్తిని నీకు ప్రసాదించిన అధిష్ఠానమైన పరమాత్మ వస్తువు నిత్యమని, దాన్ని నమ్ముకుంటే మనకు సుఖ శాంతులకు లోటుండదని గ్రహించాలి.

అనిత్యములైన వాటిని ప్రేమించటం వలన, మానవుడు సుఖ దుఃఖాలకు గురి అవుతున్నాడు. నిత్యమైన ఆత్మ వస్తువునే ప్రేమించే యెడల,

సుఖదుఃఖాలకు అతీతమైన శాంతి మానవునికి లభిస్తుంది. మనస్సు లక్ష్యార్థ వస్తువు యందు నిలబడితే, జపమాల ఆగిపోతుంది. ఇది బాబు అనుభవము. అలా అనుభవించినపుడు కలిగే ఆనందము వర్ణనాతీతము. కరెంటు స్టోరేజి ఎక్కువగా అయిన కొద్దీ కాంతి ఎక్కువగా వస్తుంది. చీకటి పోతుంది. వస్తు దర్శనమవుతుంది. అహంకార, మమకారములు చెడ్డవి. కామ పిశాచి మనిషిని సుడిగుండములో వలె త్రిప్పి పడేస్తుంది. పాతాళానికి లాగేస్తుంది.

ఈ కామ పిశాచికి మూలం మన్మథుడు. ఆయన శ్రీకృష్ణుని కుమారుడు. "ఓం కృష్ణాయనమః" అని మనం ధ్యానిస్తే మన్మథుని బారి నుండి రక్షింప బడతాము. కృష్ణుని నామం పలికే చోటికి మన్మథుడు చేరడు, లేదా, "ఓం నమశ్శివాయ" అన్నా చాలు. శంకరుడు మన్మథుని తన మూడో కంటి మంటతో భస్మం చేశాడు. కనుక ఆ మృత్యుంజయుని యందు మనస్సు నిలిపితే కాముడు దరి చేరడు. పరమాత్మని యందు లయించిన మనస్సు సంకల్ప రహిత మవుతుంది. సంపూర్ణ శాంతికి నిలయమవుతుంది. అది పెట్టుబడి లేని పద్ధతి. దానికి కుల, జాతి, వర్గాలతో నిమిత్తం లేదు. అందరికి అందుబాటులో ఉండే సొత్తు. పరమాత్మ వస్తువు ఎందరు అనుభవించినా తరగని ధనం. దానికి అందరూ హక్కుదారులే. సర్వ జీవకోట్లకు సమాన హక్కు ఉంది. అయితే దానిని పొందటానికి ఒకటే షరతు. సర్వ జీవకోట్లను తనతో సమానంగా మానవుడు ప్రేమించ గలగాలి. అప్పుడే మానవుడు భగవానుని ప్రేమించినట్లు అవుతుంది. భగవంతునిలో ద్వేషము లేదు. ఆయన అందరిలోను ఉన్నాడు. ఆయన అందరికి తన ప్రేమను అందించి, అందరిలోను తన చైతన్య కిరణాలను వ్యాప్తం చేస్తున్నాడు. ఆయనకు లేని ద్వేషము, ఓర్వలేని తనము, జాతిభేదము మనకెందుకు? అవి తీసేసుకున్ననాడు, నానాత్వం పోయి, మానవుడు మాధవుడే అవుతాడు. ఆ దివ్యనాథుని సదా మనస్సులో నిలుపుకోండి. అట్టి జీవితమే ధన్యము. ఆ హృదయం ఎవరినీ ద్వేషించదు. అందరినీ ప్రేమిస్తుంది. మహాత్ములందరూ అటువంటి సత్య ప్రేమ మార్గంలోనే నడిచారు. వారు నడచిన మార్గంలోనే నడుచుకునే మానవులు సుఖశాంతులతో తులతూగుతారు.

చంటి పాపకు ఎప్పుడేమి చెయ్యాలో తల్లిదండ్రులకు తెలుసు. మరి జగత్పిత, జగన్మాత అయిన ఆ జగన్నాథుడికి మనకు ఎప్పుడేమి అందివ్వాలో తెలియదా? ఆయన ప్రేమ స్వరూపుడు. మనం కూడా అలా ప్రేమ స్వరూపులం కావాలి. అప్పుడే తోటి మానవుని అర్థం చేసుకోగలము. మానవుని అర్థం చేసుకున్న వాడే మాధవుని తెలుసుకోగలుగుతాడు. తన్ను తాను తెలుసుకో గలుగుతాడు.

నిరతిశయమైన ఆత్మానందాన్ని అనుభవిస్తాడు. ఇది బ్రతికి ఉండగానే ఎవరికి వారు సాధించి, అనుభవించాలి.

అనేక జన్మలలో, గర్భ నరకాన్ని అనుభవించి, ఎన్నెన్నో పుణ్య పాపకర్మలు చేస్తూ గడించిన కించిత్ కించిత్ పుణ్యము రాశీభూతమైన సుకృతం వల్ల ఈ మానవ జన్మ లభిస్తుంది. దాని ఆయుః పరిమితి బహు స్వల్పము. నీటి బుడగ వలె ఎప్పుడు చితికి పోతుందో తెలియదు. కనుక మానవుడు త్వరపడి దానిని సద్వినియోగం చేసుకోవాలి. దానికి ఒకటే ఉపాయము. మనస్సును భగవానుని యందు నిలిపితే చాలు. అది తెలియని పాండిత్యమేల? భగవానుని తెలుసుకున్నదే నిజమైన పాండిత్యము. అటువంటి మహా పండితుడు పోతన. అది శ్రీనాధుని పాండిత్యము వంటిది కాదు. శ్రీనాధుని పాండిత్యము అంత్యకాలములో అతనికి కలిగిన దుర్దశను తొలగించలేక పోయింది. కాని పోతన తన సత్యమార్గంతో అందరి హృదయాలలో అజ్ఞాన తిమిరాన్ని హరించాడు. తన్ను తాను శ్రీరామ చరణాలకు అంకితం చేసుకున్నాడు. నిధుల వల్ల కలిగే సుఖము నిత్యము కాదని, రాముని సన్నిధిలో లభించే సుఖమే నిత్యమని గ్రహించాడు. శ్రీనాధుడు అహంకారి. ధనభోగాలు నిత్యమని భ్రమించి దుఃఖం పొందాడు. తారక నామ రత్నముతో పోల్చదగిన ధనం ఏముంది? దాన్ని పోతన సాధించాడు. ఇక రక్షణ కేమి లోటు? వానర సోదరుల సైన్యం ఆయన పవిత్ర గ్రంథాన్ని రాజుల దురహంకారాన్నుంచి తేలికగా కాపాడగలిగింది.

పరమ పవిత్రమైన ఆ భాగవత గ్రంథం సర్వకాల సర్వావస్థలయందు మానవులందరిలోను భక్తి అమృతాన్ని నింపుతూ, నిత్య నూతనమై, పూజ్యమై వెలుగుతూ ఉంటుంది. అదంతా కృష్ణ తత్త్వమయమే.

రేపు ఆ కృష్ణ తత్త్వాన్ని గూర్చి బాగా వివరంగా చెప్పుకుందాము. అది భగవత్తత్త్వము. ఎంతో మధురంగా ఉంటుంది. దానిని అజ్ఞులు ఎలా అర్థం చేసుకున్నారో, జ్ఞానులు ఎలా అర్థం చేసుకుని తరించారో, రేపు చెప్పుకుందాము. నిద్రపోయేటపుడు, లేచేటప్పుడు భగవన్నామాన్ని స్మరిస్తే, ఆ రోజంతా ఇంద్రియాలతోను, మనస్సుతోను, శ్వాసతోను చేసే పాప ఖర్మలన్నీ నశించి ఆరోగ్యము, ఆనందము కూడా కలుగుతాయి. గొల్ల వెంకన్న వస్తాడు రేపు. ఆ గొల్ల వెంకన్న కాళ్ళు పట్టుకుని, ఆయన గురువుగారైన ప్రచండ పండితుడు ఎలా తరించాడో, ఆ కథ వస్తుంది రేపు.

అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములు ప్రసాదించి, జగన్నాధుడు మిమ్ము సర్వదా కాపాడు గాక!

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి) -జపమాల ప్రసాద

అఖండమైన ఆనందం పొందాలి అని అనుకున్నప్పుడు, మతాలని, అభిప్రాయాలని, మనస్సులని, స్వభావాలని అడ్డుపెట్టుకొని, 'నేనింతవరకే' అని అనుకుంటూ, అడ్డుగోడలు కట్టేసుకొని, నిన్ను నువ్వే బాధలకి గురిచేసుకుంటున్నావు. నువ్వు 'ఇంత వరకే' ఉన్నావా? లేదు. నువ్వు అనంతమైనటువంటి వాడివి! అఖండమైనట్టి వాడివి - అని గుర్తింప చేస్తున్నారు సద్గురుదేవులు. ఈ వాసనలనీ, జగత్తునీ మరపింప చేయటం కోసమే, ఒక పేరుగాని పేరు ఇచ్చి, ఆ పెట్టినటువంటి పేరులోని స్వరూపాన్ని మనం పొందాలని, అభేదమైనటువంటి దృష్టికి మనని తీసుకురావాలని మహాత్ములింతగా శ్రమిస్తున్నారు. మహాత్ములు దర్శింపచేస్తున్న ఆ వెలుగుకి ఏ ఒక్కరైనా థ్యాంక్సు చెపుతున్నారా?



మనందరమూ సాధుసాంగత్యం కావాలని కోరుకుంటున్నాము. యోగవాశిష్ఠంలోని 32,000 శ్లోకాలసారం "సజ్జన సాంగత్యం లేక సాధు సాంగత్యం" అనే ఒక్క పదంలో ఉన్నదని అస్మత్ గురుదేవులు చెప్తూ వుండేవారు. సజ్జన సాంగత్యం నిస్సంగత్వానికి దారితీస్తుంది. మనకి ప్రతి ఒక్క విషయంలోనూ నిస్సంగం కావాలి (అంటే విషయాదులని విడిచి వేయాలి!) కానీ సాధువులతో సంగం లేక సాంగత్యం కావాలి. అది మనని నిస్సంగత్వానికి తీసుకువెళ్తుంది. ఇక్కడ విన్నది మనస్సుకి పట్టించుకోవాలి. ఇక ఈ సద్వస్తు విచారణలోనే వుండిపోదాం. అందులో నుండి బయటకి రావద్దు. 'బయటకి' అంటే, ఆశ్రమానికి రావద్దు అని అర్థం చేసుకోకండి. ఆశ్రమం సజ్జన సాంగత్యమే. బయట వున్న ఈ విషయాదులలోకి, ఈ ప్రపంచ భావనలోకి దేహమనే అధ్యాసలోకి రావద్దు.

'సత్సంగత్వే నిస్సంగత్వం। నిస్సంగత్వే నిర్మోహత్వమ్।
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం । నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః'

అని శెలవిచ్చారు శ్రీ ఆది శంకరభగవత్పాదులవారు. గోవిందుడిలోని నిజమైన ఆనందాన్ని మనం సత్సాంగత్యం వల్ల పొందవచ్చు. "గోవిందా!

గోవిందా!'' అని బయటకి ఉచ్చరించడమే కాదు. అనగా, అనగా, అనగా ఆ గోవిందుని లక్షణాలను మనం అలవరచుకోవాలి. జ్ఞానము అనే విందుని ఆరగించేవాడు గోవిందుడు అని గురుమహరాజ్ చెప్తూండేవారు. ఏ విషయాలయితే మన మనస్సులకి కష్టం కలిగిస్తాయో వాటిని ఆరగిస్తాడాయన! అంతేగానీ పులిహోర, దద్ధ్యోదనం కాదు. కొంతమంది జనాలు పూజకని కొన్ని రోజులు ముందునుండీ సతమతమైపోతూ వుంటారు. కానీ తీరా పూజకి కూర్చున్నాక, పూజ ఎప్పుడైపోతుందా అని కంగారుగా వుంటారు. అలాగే కొంతమంది జపం చేసేటప్పుడు కొలికిపూస ఎప్పుడొస్తుందా అని చూస్తూ వుంటారు. ధ్యానం చేస్తూ గంట ఎప్పుడవుతుందా అని చూస్తూ వుంటారు.

దేనికోసం చేస్తున్నారు ధ్యానం? అలా గంటలు లెక్కించే జపధ్యానాల వల్ల ఫలితం ఏముంటుంది? మనసునుంచి చేసే గోవింద నామస్మరణ మనలని పునీతం చేస్తుంది. సజ్జన సాంగత్యం నిస్సంగత్వానికి తీసుకువెళ్తుంది. వినగా వినగా ఏది ఎంతవరకూ వెళ్ళాలో, దేన్ని ఎంతలో ఉంచాలో అంతవరకే ఉంచేటట్టు చేస్తుంది సాధుమహాత్ముల వాక్కు. అటువంటి కాలజ్ఞానస్వరూపులైన మహాత్ములు కాలం చేయడమనేది లేదు. వారేనాడూ కాలానికి బంధింపబడరు. కేవలం మనకి కాలాన్ని గుర్తింపచేసి, జీవితానికి ఉన్నతమైన స్థానాన్ని ప్రసాదిస్తారు వారు.

గృహస్థాశ్రమంలో ఉన్నవారు ప్రపంచం వదిలి పారిపోతే అది పిరికితనమనిపించుకుంటుంది. ప్రపంచంలోనే వుంటూ, దానిపైన ఆసక్తి లేకుండా ఉండటమే నిజమైన సన్యాసమంటే.

నిస్సంగత్వం నిర్మోహత్వానికి తీసుకువెళ్తుంది. ప్రొద్దున్న లేస్తే మనకెన్నెన్ని మోహాలండీ! కాఫీ, టిఫిన్, రకరకాల టేస్టులు (రుచులు)! ఇడ్లీ కంటే పూరీ, పెసరట్టు గొప్పవి అంటారు! ఆ గొప్పవే మన కడుపుని పాడుచేస్తున్నాయి! ఆపాడు చేసేవే మనకి పాడు బుద్ధులు కలిగిస్తున్నాయి. అదే జిహ్వా చాపల్యం ! దానికే వేదాంతం 'జిహ్వా చావనిదే, ఉపస్థచావదు' అని చెప్తోంది. ఇంద్రియనిగ్రహం కలగాలంటే ముందు జిహ్వాని అదుపులో వుంచుకోవాలి. ఆశ్రమవాసులయిన మనం, ప్రసాదాన్ని ప్రసాదంగా తీసుకోవాలిగానీ, ఇది ఫ్రైడ్‌రైసు, ఇది కూర, ఇది కుర్మా, అని ఎంచితే ఏనాడైనా పదార్థ దృష్టిని దాటగలమా? నువ్వు పదార్థాన్ని దాటి వస్తే ఇక్కడే ముక్తిని పొందగలవు. ముక్తి చచ్చాక రాదు. చచ్చాక వచ్చేవి ఎత్తిపోతలు, బూడిద,

అస్థికలు! ఈమధ్య శవాలని కాల్చే మిషన్లు వచ్చేశాక అదీ మిగలటంలేదు! 'మా నాన్నగారి అస్థికలు కావాలండీ!' అంటే, ఏదో అరలో ఏ మూలనోవున్న గుప్పెడు బూడిదని తీసి 'ఇదే మీ నాన్నది' అని ఇస్తాడు. అనేక భ్రాంతులు చెందుతున్నాం గానీ, మనని మనం తెలుసుకునేటటువంటి గుర్తు మట్టుకు రావటంలేదు. సృష్టిలో అనేక జీవరాసులున్నా, వాటి వేటికీ, తమని గురించి తాము తెలుసుకునే జ్ఞానము, అవకాశము లేదు. తనని తాను గుర్తించే తెలివి ఒక్క మానవజన్మకే సాధ్యం. అదే మానవ జన్మ యొక్క గొప్పతనం. అది ఎలా తెలుసుకోవాలో మహాత్ములు మనకి అందిస్తున్నారు. కానీ, ఆ మహానుభావులు చెప్పినట్టుగా మనం చేయాలిగా!

**యత్ పరం సకల వాగగోచరం**
**గోచరం విమల బోధ చక్షుష:**
**శుద్ధ చిద్ఘనమనాది వస్తుయత్**
**బ్రహ్మతత్వ మసి భావయాత్మని ॥**

అని 'వివేక చూడామణి'లో శ్రీ ఆది శంకర భగవత్పాదుల వారు సెలవిచ్చియున్నారు. అంటే ఏ ఆత్మవస్తువు అయితే ఈ కనిపించే దృశ్య జగత్తుకంటే పరంగా వుండి, ఈ సమస్త జగత్తుని ప్రకాశింపచేస్తూ తాను మాత్రం సాక్షిమాత్రంగానే వున్నదో, అది సకల వాక్కులకి అగోచరం, అది మాటలకి అందేది కాదు. అది కేవలం విమలమైన జ్ఞాన నేత్రానికి మాత్రమే గోచరమవుతుంది. మాటలకి అందని వస్తువైనా, చెప్పుకోకతప్పదు. మహాత్ములు మనకి అందించక తప్పదు కాబట్టి, అక్షరస్వరూపమైన ఆత్మవస్తువును కొన్ని అక్షరాలలో కుదించి మనకి అందిస్తున్నారు. అటువంటి అనాదియైన శుద్ధచిద్ఘన ఆత్మవస్తువే 'నేను' అని భావన చేయమని బోధిస్తున్నారు.

మహానుభావుల ముఖస్థగా ప్రవహించినటువంటి బోధలయందు, ఆ స్వరూపం నుండి వచ్చిన వేదములు, వేదముల నుండి వచ్చిన ఉపనిషత్తులు, ఉపనిషత్తులనుండి వచ్చిన భగవద్గీత, ఆ భగవద్గీత యొక్క సారమైన విశ్వాసం, సజ్జన సాంగత్యం, భక్తి అనే వాటిలో మనస్సును నిరంతరం ఊరవేయాలి. శెనగ గింజని ఎందులో ఊరవేస్తే (ఉదా॥ ఆవకాయ, వేపరసం, పంచదార పానకం) దానికారుచే వచ్చినట్లు, మనస్సనే శెనగగింజని నిరంతరం సత్సాంగత్యంలోనే వూరవేసి వుంచితే దానికి సత్యవస్తువు లక్షణాలే అబ్బుతాయి.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గతసంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

24-3-1985

ఈ రోజు రాత్రి శ్రీబాబు దర్శనార్థం వచ్చిన భక్తులలో ఒకరు ఒక సందేహాన్ని లేవనెత్తుతూ అహంకార మమకారాలు రహితం అయితేనే ఆత్మ దర్శనం అవుతుంది అంటారు కదా! నా గురుదేవుడు అనే మమకారం, అహం బ్రహ్మాస్మి అనే అహంకారం ఉండవచ్చునాండీ? అన్నారు.

శ్రీబాబు సమాధానం చెబుతూ నీటిలో తల వరకూ మాత్రమే మునిగితే బుడబుడమని శబ్దం వస్తుంది. నీటిలో పూర్తిగా మునిగిన వానికి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు ఉండవు. సర్వకాల సర్వావస్థల యందు గురువు యందే మనస్సు లగ్నం చేసినవాడికి మమకారం ఉందనటం సబబేనా? అలాగే అహం బ్రహ్మాస్మి అనే వాక్యాన్ని వల్లించేవాడికి అహంకారం ఉండవచ్చుగాని, దాన్ని అనుభవించేవాడికి అహంకారం ఉందనటం తెలివితక్కువ తనం అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ మీరు ఏమీ అనుకోనంటే మీకు ఒక ఉదంతం చెబుతాను. ఒక భక్తుడు చాలా కాలంగా సాధన చేస్తూ తాను ఏమీ సాధించలేకపోయాను అని విసిగిపోయి ఎలాగైనా ఏవైనా మంత్ర విద్యలని పొంది పదిమందికి తన మహత్తులని ప్రదర్శించి కీర్తి ప్రతిష్ఠలు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఎన్నో దేశాలు తిరిగాడు. ఎంతోమంది మహాత్ములని సందర్శించాడు. కాని మనస్సు ఎక్కడా లగ్నం కాలేదు. రెండు పడవల మీద కాళ్ళు ఉంచినవాడి గతి ఏమౌతుందో చెప్పండి? నీట మునిగి పోవలసినదే కదా! ఏమీ సాధించలేక ఉన్మాదియై చివరకు ఒక యోగిపుంగవుని దర్శిస్తాడు. ఆ యోగిపుంగవుడు చూపుతోనే తనను దర్శింపగోరి వచ్చిన వ్యక్తి యొక్క మనస్సులోని భావాన్ని గ్రహించాడు. ఉన్మాద స్థితిలో ఉన్న వ్యక్తికి ఎలాగైనా కనువిప్పు కలిగించి, సక్రమమైన మార్గంలో పెట్టడానికి నిర్ణయించుకుంటాడు.

యోగిపుంగవుడు మాట్లాడుతూ వత్సా! నీకు ఒక పిశాచాన్ని వశం చేస్తున్నాను. దాన్ని వశం చేసికొని నీవు ఏది కావాలంటే దాన్ని పొందగలవు. కాని ఒక్క షరతు ఉంది. నువ్వు మాత్రం ఆ పిశాచానికి ఏ పనీ చెప్పకుండా

సోమరిగా ఉంచితే మాత్రం ఆ పిశాచము నిన్నే ఆహారంగా తినేస్తుంది సుమా! అని హెచ్చరిస్తాడు. అహంకారపూరితుడైన కపట భక్తుడు ఆ పిశాచాన్ని వశం చేసుకుని తనకు కావలసిన పనులన్నీ చేయించు కొనసాగాడు. ఏ పని చెప్పినా ఆ పిశాచం ఒక్క క్షణంలో చేయసాగింది. చివరకి తన ప్రాణానికి ముప్పు వచ్చే పరిస్థితి ఏర్పడింది. విషమ పరిస్థితులలో యోగిపుంగవుడు స్ఫురణకి వచ్చాడు.

వెంటనే ఉన్మాదియైన కపట భక్తుడు యోగిపుంగవుని దగ్గరకు వెళ్ళి మహాత్మా! మీరు నాకు వశం చేసిన పిశాచం నన్ను భక్షించటానికి సిద్ధంగా ఉంది. మీరే నన్ను రక్షించాలి అని ప్రాధేయ పడ్డాడు. తమను ఆశ్రయించిన శిష్యులని మహాత్ములు ఎప్పుడూ అలక్ష్యం చేయరు. శరణు శరణు గురుదేవా! అంటే మీ గురుదేవుడు మీకు రక్షణ ఇవ్వకుండా తిరస్కరిస్తాడా!

యోగిపుంగవుడు మాట్లాడుతూ శిష్యా! కంగారుపడకు. నీకు వశమైన పిశాచానికి ఒక కుక్క తోక వంకర లేకుండా చేసే పనిని అప్పగించు. అంతటితో దాని ఆటకట్టు అంటాడు. శిష్యుడు గురుదేవుడు చెప్పినట్లు ఆచరించి ఆ భూతం నుండి రక్షింపబడతాడు అని కథ చెప్పి ఎలా ఉంది? అన్నారు శ్రీబాబు.

ఈ కథను విన్న భక్తుడు మాట్లాడుతూ అయితే నేను ఉన్మాదిని అంటారా? అని ప్రశ్నించాడు. శ్రీబాబు మాట్లాడుతూ మిమ్మల్ని ఉన్మాది అనలేదు. మీరు నేను చెప్పిన కథలోని సారాంశాన్ని గ్రహించండి. మీరు పండితులు. పదిమందికి ఉపన్యాసాలిచ్చి తత్వాన్ని చెబుతూ ఉంటారు కదా! ముందు మిమ్మల్ని మీరు విచారణ చేసి తెలుసుకున్న తరువాత అప్పుడు ఇతరులను సంస్కరించడానికి పూనుకుంటే బాగుంటుందేమో!. అహం బ్రహ్మాస్మి అనే అహంకార భావనతో ఇతరులను ఏం సంస్కరించ గలుగుతారు? ముందుగా తనను తాను సంస్కరించుకుంటే, తరువాత ఇతరులని సంస్కరించవచ్చు అన్నదే ఈ కథలోని సారాంశం అన్నారు శ్రీబాబు.

**25-3-1985**

ఈ రోజు సాయంత్రం విశాఖపట్నంలో శ్రీబాబు దర్శనార్థం వచ్చిన భక్తులంతా నమస్కారాలు చేసుకుంటున్నారు. సంకీర్తన

జరుగుతోంది. ఒక భక్తురాలు నమస్కారం చేసుకుంటూ శ్రీబాబును ఏదో ప్రశ్నించారు. సంకీర్తన ఆగిపోయింది. శ్రీబాబు గంభీరంగా మాట్లాడుతూ నేను ఇక్కడికి విశ్రాంతి తీసుకుందామని వచ్చాను. వచ్చిన తరువాత తత్త్వవిచారణ చేసి, వీరందరిలో భక్తి బీజాలను నాటి, భగవంతుని వైపు వీరి దృష్టి మరల్చుదామనుకుంటే పుట్టెడు కోర్కెలతో వచ్చి ప్రతివారు ఆంతరంగికంగా ఏకాంతంగా నాతో మాట్లాడాలని ప్రయత్నం చేస్తూ భగవంతుని విచారణను బుట్టదాఖలా చేస్తున్నారు. ఏం లాభం? గురుదేవుడు చేసిన బోధలో ఏ ఒక్కదాన్ని ఆచరించినా ఇహంలో కావలసిన కోర్కెలన్నీ తీరటమే గాక ధన్యత్వాన్ని పొంద గలుగుతారు అన్నారు.

ఇది ఎప్పుడూ ఉన్నదే కదా! అంటూ శ్రీబాబు జాలయ్యగారి అల్లుడిని ఉద్దేశించి మాట్లాడుతూ ఏమయ్యా? మీసం తీసేశావేమిటి? ఎందుకు మీసం తీశావో ఆ కథ అంతా చెప్పనా? లేకపోతే అందరికీ ఐస్‌క్రీమ్ తెచ్చి ఇస్తావా? రేపు అందరికీ ఐస్‌క్రీమ్ ఏర్పాటు చేయి అన్నారు.

ఇంకొక భక్తుణ్ణి ఉద్దేశించి మాట్లాడుతూ ఏరా ఎక్కడకి వెళ్ళాలని అనుకుంటున్నావు? నీలో ఉన్న కీడు తొలగిపోవాలంటే నృత్యం చేస్తూ ఒక పాట పాడు అన్నారు. అదుగో అక్కడ కూర్చున్న మీ తాతగారు నువ్వు కలసి నృత్యం చేస్తూ పాట పాడండి. నువ్వు బాగు పడిపోతావు అన్నారు. వారిద్దరూ కలిసి శ్రీరామ జయరామ జయజయ రామ అంటూ పాడుతూ చక్కగా నృత్యం చేశారు.

శ్రీబాబు వారిద్దరినీ ఆశీర్వదిస్తూ మానవుడు ఎప్పుడు ఏ రకంగా మారతాడో మనం ఏం చెప్పగలం? అంతవరకు ఏ స్థితిలో ఉన్నా ఏ క్షణంలోనైనా మారవచ్చు. అలా మార్చగలిగేది గురుశక్తి. మానవుడు తాను కోరి సంకటములను తెచ్చుకుంటాడు. తాను చేసిన దుష్కృతముల ద్వారా ఫలితాన్ని అనుభవిస్తాడు. నిప్పులో చేయి పెడితే కాలక తప్పదు కదా! నేను నిప్పులో చేయి పెట్టినా కాలకుండా భగవంతుడు రక్షించలేడా అనుకుంటాడు. మానవుడికి ఇంకొక సందేహము కూడా కలుగవచ్చు. తాను అసలు దుష్కార్యములు చేయడానికి ఆ రకంగా బుద్ధిని ప్రబోధం చేయకుండా ఎందుకు ఆపలేకపోయాడు? అని ప్రశ్నిస్తాడు. దీనికి ఒక ఉపమానం చెబుతాను. ఈ ఉపమానం మీ అందరికీ బాగా అవగాహన అవుతుంది. కాని నన్ను మాత్రం అపార్థం చేసుకోకండి. -సశేషం

# శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**జూన్ 2010**

| | | |
|---|---|---|
| 2 | బుధ | శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సహిత శ్రీ రామలింగేశ్వరస్వామి ప్రతిష్ఠా ఏకోనత్రింశత్ వార్షిక మహోత్సవము, రాత్రి 7గం॥లకు శ్రీ మహాకాళికా పరమేశ్వరీ రామలింగేశ్వర స్వామివారి లీలా కళ్యాణ మహోత్సవము. |
| 7 | సోమ | శ్రీ గురుదశమి, హనుమజ్జయంతి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. |
| 11 | శుక్ర | మాస శివరాత్రి |
| 20 | ఆది | శ్రీ సుగుణప్రసాద మాతాజీవారి తృతీయవార్షిక పుణ్యారాధన, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం. |
| 26 | శని | జ్యేష్ఠపూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ. |

**జూలై 2010**

| | | |
|---|---|---|
| 6 | మంగ | శ్రీగురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ. |
| 10 | శని | మాసశివరాత్రి. |
| 17 | శని | దక్షిణాయన ప్రారంభము |
| 21 | బుధ | తొలిఏకాదశి, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. |
| 25 | ఆది | ఆషాఢ (వ్యాస) పూర్ణిమ,శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. (చాతుర్మాస్య దీక్ష ప్రారంభం) |

## శ్రీమాతాజీ అమెరికా పర్యటన

పూజ్య యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ, శ్రీ కాళీ వనాశ్రమ పీఠాధిపతులు జూన్ 8వ తేది బయలుదేరి 9వ తేది న్యూయార్క్ చేరుకుంటారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో జులై 3,4,5 తేదీలలో త్రయాహ్నిక దీక్షా పూర్వకంగా జరిగే సత్సంగ సమావేశ కార్యక్రమాలలో పాల్గొంటారు. అమెరికాలోని వివిధ ప్రాంతాలలో ఉన్న భక్తులకు, తమ దర్శన భాగ్యాన్ని ప్రసాదించి తిరిగి జులై 20వ తేదిన భారతదేశం చేరుకుంటారు.

# సత్సంగ సౌరభం

-శివ ప్రసాద్

(మార్చి ది. 18న పరమహంస పరివ్రాజక పూజ్యపాద శ్రీశ్రీశ్రీ 108 దండి నిర్మలానందగిరి స్వామిజీ మహరాజ్‌వారు మౌనధ్యాన సప్తాహంలో చేసిన అనుగ్రహ భాషణమును ఇక్కడ సంగ్రహంగా ప్రచురిస్తున్నాము -ఎడిటర్)

ధ్యానం అంటే ఏమిటి? ధ్యేయాయాః చింతనం ధ్యానమ్. దేనిని ధ్యానం చేయాలి? ధ్యేయమైన పరబ్రహ్మవస్తువునే చింతన చేయటం ధ్యానం. ధ్యేయం అంటే పరబ్రహ్మ స్వరూపం. పరబ్రహ్మమునే చింతన చేయాలి. మనం ఎవరమైనా సరే చింతన లేకుండా ఉన్నామా? ఒక్కక్షణం అయినా చింతన లేకుండా ఉన్నవాళ్ళెవరైనా ఉన్నారా? ఏదో ఒక చింతన చేస్తూనే ఉంటాము. ఏమో ఎవరైనా మేము ఉన్నాము అంటారేమో. నేను మాత్రం చింతన చేస్తూనే ఉంటాను. అయితే దేనిని గురించి చింతన చేయాలి? పరబ్రహ్మాన్ని గురించే చింతన చేయాలి. ప్రపంచాన్ని గురించి చింతన చేయకూడదు. ఎందువలన? ప్రపంచం అనిత్యమైనది. దానిని చింతన చేస్తే నీవు కూడ అనిత్యుడవై పోతావు. అందువలన పరమాత్మను గురించే చింతన చేయాలి. ఆ చింతన ఎలా చేయాలి?

విజాతీయ తిరస్కార పూర్వక సజాతీయ ప్రవాహ ధ్యానం. ధ్యానం విజాతీయ తిరస్కార పూర్వకంగా ఉండాలి. ఈ ధ్యానం చేసేటప్పుడు అనేకమైనవి వస్తూ ఉంటాయి. వాటిని తిరస్కారం చేయాలి. తిరస్కారమంటే? తిరస్కారమంటే ఉదాసీనం అని చెప్పారు మా గురుదేవులు. దానియందు హఠం పట్టవద్దన్నారు. ప్రపంచ విషయాలలో దేనిపైన హఠం పడతావో, అది నీ నెత్తిన ఎక్కి కూర్చొని నీ చేత చేయించుకొని తీరుతుంది అనేవారు మా గురుదేవులు. ఇది కీలకం. ప్రపంచ విషయాలలో దేనియందు కూడ నీవు హఠం పట్టవద్దు. మరేం చేయాలి? ఉదాసీనంగా ఉండిపో. అంటే, దానితో తాదాత్మ్యం చెందకుండా ఉండటమే. విజాతీయ తిరస్కార పూర్వకమే కాదు. సజాతీయ ప్రవాహం. సజాతీయం అంటే? స్త్రీలు స్త్రీలు సజాతీయం. పురుషులు పురుషులు సజాతీయం. కాని ఈ సజాతీయం కాదు. ఆ స్త్రీలలో, పురుషులలో ఉండే పరబ్రహ్మతత్త్వం సజాతి. అది ఎలా ఉండాలి? ఆ పరబ్రహ్మతత్త్వ చింతన ప్రవాహంలా ఉండాలి. ప్రవాహంలా అంటే ఉపనిత్తు చెప్పింది. తైలధార ఇవ అవిచ్ఛిన్నం, దీర్ఘఘంటా నినాదవత్ అని.

ఈ మధ్య చాలమందికి మేము ధ్యానం చేస్తున్నాము, మేము యోగా చేస్తున్నాము అని చెప్పుకోవటం ఒక ఫ్యాషన్ (fashion) అయిపోయింది. ఎటువంటిది వీరు చేసే ధ్యానం లేదా మెడిటేషన్? ధ్యానం గురువుల వద్ద చేయాలి. అలా కాకుండా మూడు మాసాలో, మూడు సంవత్సరాలో ట్రెయినింగ్ అయి వచ్చిన వాళ్ళుకూడ క్లాసులు నడుపుతున్నారు. వాళ్ళకు తెలిసింది ఎంత?

సద్గురువుల దగ్గర పాదసన్నిధానంలో ఉండి, ఆ ధ్యానం చేసేటప్పుడు నీకు ఏయే అవరోధాలు వస్తున్నాయో, ఆ అవరోధాలను ఎలా నిర్మూలం చేసుకోవాలో సద్గురుదేవుల వద్ద తెలుసుకుంటూ వారి సన్నిధానంలో నీ సందేహాలను నివృత్తి చేసుకుంటూ ధ్యానం చేయాలి. అవి పోవాలంటే ధ్యానం ఎలా చేయాలి? తైలధార విచ్ఛిన్నం. ధ్యానం మధ్యలో ప్రపంచ విషయాలకు సందివ్వకూడదు. సందిచ్చావా, అది చేరిపోతుంది.

దత్తాత్రేయుల వారికి సముద్రం గురువట. ఆయనకేమిటి? మనకూ గురువే. ఎందువలన? సముద్రం ఒక చిన్న గడ్డిపోచను కూడ తనలోకి రానీయదు. బయటకు నెట్టిపారేస్తుంది. ఈనాడు, గడ్డిపోచకో చెత్తకో గనుక సముద్రం స్థానం ఇస్తే, రేపు దూలాలు కూడా వచ్చి చేరిపోతాయి అందులో. అందుకే సాధకులు ప్రపంచ విషయాలకు కొంచెం కూడ తావివ్వకుండా ఉండాలి. అంటే, ధ్యానం తైలధార విచ్ఛిన్నంగా చేయాలి. ఒక పాత్రలో ఉన్న నూనెను క్రింద పాత్రలోకి వంచితే, అది ఏ విధంగా అయితే అవిచ్ఛిన్నంగా తెంపు లేకుండా పడుతుందో అలా, దీర్ఘ ఘంటా నినాదవత్, గంటను వాయించినప్పుడు, ఆనాదం ఎలా అవిచ్ఛిన్నంగా ఉంటుందో, ఆ విధంగా ధ్యానం చెయ్యి. అప్పుడు ప్రపంచ విషయాలు నీ ధ్యానంలో చేరటానికి ఆస్కారం లేకుండా ఉంటుంది.

ధ్యానం అలా కాకుండా చేస్తుంటే, ఇప్పటినుండైనా తైలధారలా ధ్యానం చేసేదానికి ట్రెయినింగ్ అవ్వాలి. అంటే అది గబగబా చేయాలా? ఎలా చేయాలి? స్వామివారు భగవద్గీతలో చెప్పారు. శనైశ్శనైరుపరమేత్ అని. మెల్లగా మెల్లగా చెయ్యి. గబగబా చేస్తే లాభం లేదు. స్పీడ్ పనికిరాదు. ప్రపంచ విషయాలలో స్పీడ్ పనికి వస్తుందేమోగాని సాధకుడికి ఆధ్యాత్మిక విషయాలలో స్పీడ్ అసలు పనికిరాదు. స్పీడ్ వలన ఏమౌతుంది? స్పీడ్ ఎక్కువైతే ప్రాణాలు పోతై.

-సశేషం

# సంత్ నామదేవ్ చరితామృతం

(గతసంచిక తరువాయి) -మనోజ్ కుమార్

కార్తీక ఏకాదశి సందర్భంగా అళందినుండి నివృత్తినాథ్, జ్ఞానదేవుడు, సోపానదేవుడు, ముక్తాబాయి దశమి నాటికే పంఢరి చేరుకున్నారు. నామదేవుడు, జ్ఞానదేవుడు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. దామా సెట్టి, గోణాబాయి నివృత్తినాథ్‌తో 'వెఱ్ఱిబాగులోడు అయిన మా నామాని మీవాణ్ణిగా స్వీకరించారు. ఈ ఇంటిలో మీ పాదధూళి రాల్చారు. మా వంశం ధన్యం అయింది' అన్నారు. జ్ఞానదేవులతోపాటు విసోబా కూడ వచ్చారు. నామదేవుడికి సద్గురుదేవుల పునర్దర్శన భాగ్యం కలిగింది. తేరఢి నుండి ఘోరాకుంభార్ కూడా వచ్చాడు. చోఖా, బంకా అందరూ జాతి కుల వివక్షత లేకుండా సహపంక్తి భోజనం చేశారు. భక్తులు ఆనాడంతా చంద్రభాగ ఇసుక తిన్నెలలో జాగరణ చేశారు. పంఢరి అంతా నామ సంకీర్తనతో దద్దరిల్లింది. ఏకాదశినాడు చంద్రభాగలో స్నానం చేసి అందరూ శ్యామసుందరుడు అయిన విఠలుడి దర్శనం చేసుకున్నారు. త్రయోదశినాడు ఏకాహం. చతుర్దశినాడు అందరూ మందిరంలో మౌనంగా కూర్చున్నారు. జ్ఞానదేవుడు దృష్టిని స్థిరం చేసి మౌనంగానే పాండురంగణ్ణి ఏదో అడగటం, మౌనభాషలోనే పాండురంగడు ఏదో సమాధానం చెప్పటం గమనించి నామదేవుడు జ్ఞానదేవుణ్ణి వారిద్దరూ మౌనంగా ఏం మాట్లాడుకున్నది చెప్పమని అడిగాడు.

**జ్ఞాన** - నిన్ను నాకిచ్చేయమని, నాతోపాటు ఉత్తర దేశ తీర్థయాత్రలకు పంపమని అడిగాను. పాండురంగడు అనుజ్ఞ ఇచ్చాడు.

**నామ** - నేనెప్పుడూ మీవాణ్ణే. ఇదివరకు అయితే పంఢరి వదలాలంటే గగ్గోలు పెట్టే వాడిని. కాని ఇప్పుడు నాకు గురుదేవుల పూర్ణానుగ్రహం వలన అంతా, అంతటా ఆ పాండురంగడే అన్న అనుభూతి దృఢంగా నిలిచిపోయింది.

**జ్ఞాన** - ఇప్పుడు ఉత్తర భారతంలో సనాతన ధర్మంపై పరధర్మ నీలిమేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. అక్కడ తీర్థస్థానాలు అన్నీ భ్రష్టుపట్టిపోయాయి. అక్కడి జనులకు నామ మాహాత్మ్యం, భక్తి మాహాత్మ్యం తెలిపి వారినందరిని ఒక్క త్రాటిపైన నడపాలి. నీతో పాటు మిగిలిన సజ్జనులు కూడా వస్తే బాగుంటుంది.

**నామ** - నాకు ఇంకొక కోరిక కూడ మిగిలింది. మీరు సామాన్యుల కోసం

మరాఠి భాషలో వ్రాసిన భావార్థ దీపిక అయిన జ్ఞానేశ్వరిని వినిపించాలి. రోజు రాత్రి సత్సంగం చేసి జ్ఞానేశ్వరిని చెప్పండి. అందులోని ప్రతి ఓవిని మేము మంత్రదీక్షగా స్వీకరిస్తాము.

**జ్ఞాన -** సరే రేపు పౌర్ణమి. అందరం జ్ఞానేశ్వరిని అభంగంగా పాడుతూ బయలుదేరుదాం.

కార్తీక పౌర్ణమి మహాపర్వదినం నాడు ఇద్దరు భక్తులూ విఠలుడి వద్ద సెలవు తీసుకున్నారు. భక్తబృందం పాండురంగడి పరమ ప్రేమను తలచు కుంటూ, నామసంకీర్తనం చేస్తూ ముందుకు కదిలింది. మొదటి మజిలీ చేరగానె నామదేవుడికి చేసిన వాగ్దానం ప్రకారం **ఓం నమోజీ ఆద్య వేద ప్రతిపాద్య జయ జయ సంవేద్యా! ఆద్య రూపా!** అని సరస్వతీస్తవం చేస్తున్న ప్రథమ శ్లోకంతో జ్ఞానేశ్వరి పారాయణకు శుభారంభం చేశారు, జ్ఞానదేవులు. జ్ఞానేశ్వరి ప్రవచనం, అభంగ కీర్తనంతో కలికల్మషాన్ని పారద్రోలుతూ యాత్ర ముందుకు సాగుతున్నది. వింధ్య పర్వతాలలో కీకారణ్యాలలో వారు ప్రయాణం చేస్తున్నప్పుడు, హరిపాల వంటి దోపిడి దొంగల హృదయాలలో కూడ పరివర్తన వచ్చి వారూ ఆ భక్తి గంగలో కలసిపోయారు. బృందం సాత్పుడా పర్వతాలు దాటి థార్ ఎడారి చేరుకున్నది. అక్కడ కమలాకర్ భట్ కలిశారు.

అక్కడనుండి భాష మారింది. జ్ఞానదేవుల ఆదేశంపై నామదేవుడు కమలాకర్ భట్‌వద్ద హిందీ నేర్చుకోవటం మొదలు పెట్టాడు. బృందం మార్వాడ్ చేరుకున్నది. మార్వాడ్ అంటె బాగా నీటి కొరత ఉన్న ప్రదేశం. మైళ్ళ తరబడి దూరం నుండి త్రాగే నీరు తెచ్చుకోవాలి. యాత్రికులకు బాగా దాహం వేస్తున్నది. పరిసా గబగబా ప్రక్కనే ఉన్న ఒక బావి దగ్గరకు వెళ్ళి చాద లోపలికి వదిలాడు. బావి అడుగు కనబడటంలేదు కాని బిందె అడుగుకు తాకి ఖంగు మని చేసిన శబ్దం వినిపించింది. అందరి ముఖాలలో నిరాశ. అప్పుడు నామదేవుడు కల్పించుకుని మనం ఆ శ్రీహరి మహిమను గానం చేయటానికి అన్నీ వదులుకుని వచ్చినవాళ్ళము. ఆ దయామయుడు మనలను ఆకలి దప్పులతో ఎప్పుడూ ఉండనివ్వడు అంటూ సంకీర్తన ప్రారంభించాడు. జయ జయ రామకృష్ణ హరి, విఠలా విఠలా జయ హరి విఠలా అని నామం చేస్తూ అందరూ నృత్యం చేశారు. అంతలో ఎక్కడ నుండి వచ్చిందో ఒక కారుమేఘం వచ్చి సూర్యుణ్ణి కప్పివేసింది. కన్నుమూసి తెరిచేంతలో ఆకాశం అంతా కారుమేఘాలు దట్టంగా క్రమ్మేశాయి. నామ గర్జన చేస్తున్నట్లు ఆ మేఘాలన్నీ గర్జించాయి. టప టపమని చినుకులు పడటం మొదలై అంతలోనే కుండపోతగా ఏనుగు

తొండాలవంటి ధారలతో పర్జన్య వృష్టి మొదలైంది. బావి స్వచ్ఛమైన స్వాదుజలంతో నిండిపోయింది. అందరూ తృప్తిగా కడుపునిండా ఆ చల్లని మధుర జలాలను త్రాగారు.

**జ్ఞాన -** (ప్రశంసా పూర్వకంగా) నామా! సగుణ భక్తి మాహాత్మ్యాన్ని మరొకసారి నిరూపించావు. పరమేశ్వరుని అస్తిత్వాన్ని అందరికీ తెలియచేశావు. ఈ బావి ఎన్నడూ ఎండదు. ఇక ముందు ఈ బావి ఎప్పుడూ మధుర జలాలతో నిండి నీ పేరుతో పిలువ బడుతుంది.

**నామ -** ( భక్తి వినయాలతో) అదేం కాదు. ఈ నాటకం మీరు ఆడించిందే. నాకు పరీక్ష పెట్టి నన్ను ఆ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యేలా చేసిందీ మీరే. ఆ బావిని నీటితో నిండేటట్టు చేసిందీ మీరే. మీరు స్వయంగా విఠల స్వరూపులు.

తరువాత అందరూ జూనాగఢ్‌లో కృష్ణ భక్తుడైన నర్సీమెహతాను కలుసుకున్నారు. ఆ కృష్ణ భక్తుడు బోధించిన రామనామ మాహాత్మ్యం విన్న తరువాత రామకృష్ణుల అద్వైతం అందరికీ అర్థమైంది.

ఎనిమిది నెలల తరువాత యాత్ర దిగ్విజయంగా ముగించుకొని యాత్రికుల బృందం పంఢరి తిరిగి వచ్చింది. శుద్ధ చతుర్దశినాడు పాండురంగడి సన్నిధిలో జ్ఞానదేవుడు నామదేవుడితో....

**జ్ఞాన -** నామా! నా విహిత కర్తవ్యం సమాప్తమైంది. ఈ జ్ఞాన భక్తిని దేశమంతా నలుమూలలా తిరిగి ప్రచారం చేసే బాధ్యత నీపైన ఉంచుతున్నాను. కార్తీక మాసంలో ఏకాదశినాడు పాండురంగడి దివ్య రూపాన్ని మనస్సునిండా నింపుకుని అళందికి రా. ఆరోజు భక్తులతో కలసి భజన చెయ్యి. ద్వాదశినాడు అందరం సహభోజనం చేద్దాం. త్రయోదశినాడు నీ సాకారరూపంలోని నిరాకార నిర్గుణ పాండురంగడిలో నా ఈ ఉపాధిని లీనం చేస్తాను.

జ్ఞానదేవుడు మౌనం వహించాడు. నామదేవుడి మనస్సు మొద్దుబారి పోయింది. చెంపలపై కన్నీరు ధారలుగా కారుతున్న నామదేవుణ్ణి ఊరడిస్తూ....

-సశేషం

## టీ.వీలో శ్రీమాతాజీవారి కార్యక్రమాలు

**శ్రీ మాతాజీవారి సంకీర్తన భక్తి ఛానెల్‌లో ఉదయం 5గం॥30ని॥ నుండి అనుగ్రహ భాషణం, టి.వి-(1)లో ఉదయం 5గం॥30ని॥ నుండి ప్రసారమౌతున్నాయి. భక్తులు విని తరించ గలరు.**

# కృష్ణతత్త్వము, ప్రేమ యోగము

(గతసంచిక తరువాయి)

- సుషుమ్న ప్రసాద

**ఉదాత్తమైన ప్రేమతో దిన చర్యను ప్రారంభించు.**
**నిస్స్వార్థమైన ప్రేమతోనే నీ దిన చర్యను కొనసాగించు.**
**రోజంతా ఆ మహత్తరమైన ప్రేమను ఇతరులతో పంచుకుంటూ గడుపు.**
**నిత్యమైన ప్రేమతోనే దిన చర్యను ముగించు.** అదే భగవానుని చేరుకొనే మార్గము.

భగవంతుని చేరుకోటానికి ప్రేమయే సూటియైన, సవ్యమైన మార్గమని, కృష్ణ పరమాత్మ స్పష్టపరిచారు. శ్రీకృష్ణ పరమాత్మ ధరించిన చక్రాయుధము ప్రేమాయుధమే. ప్రేమ యజ్ఞంతోనే ధర్మసంస్థాపన చేసి, యావత్ప్రపంచాన్ని ప్రభావితం చేశారు. ప్రేమ, దయ, క్షమ, త్యాగం కృష్ణతత్త్వానికి మూల స్తంభాలు. సత్యమైన, నిస్స్వార్థమైన ప్రేమ రాగద్వేషాలకతీతమైనది. ఆ ఉదాత్తమైన ప్రేమలో ఇచ్చుటయేకాని, పుచ్చుకొనుట తెలియదు. జప, తప, యోగాదులకన్నా ప్రేమ వల్ల స్వామిని సొంతం చేసుకొనుట సులభమని, కృష్ణ పరమాత్మ గోపికల ద్వారా నిరూపించాడు. అనన్య భక్తిని ప్రేమ పూరితం చేసి, నిష్కామంగా భగవంతునికి సమర్పించినప్పుడే, భగవంతుడు భక్తుని వద్దకు వచ్చి చేరుతాడు. శ్రీకృష్ణుడు నిర్మలమైన, నిస్స్వార్థమైన, అచంచలమైన అనన్య ప్రేమతో కూడిన భక్తి తత్పరతకు ఎలా కరిగిపోగలడో, ఏవిధంగా ఆదుకొని హృదిలో సుస్థిర పరచుకోగలడో గోపికల భక్తి తత్పరతలో గోచరిస్తుంది. ప్రేమ మానవునిలో ప్రవేశించి సత్యరూపాన్ని ధరిస్తుంది. అందుచేతనే కృష్ణ పరమాత్మను సత్యా ప్రియుడన్నారు. ఆ సత్యమే, ఆచరణలో ధర్మమవుతుంది. శాంతి, ధర్మంలో అంతర్లీనమయి ఉంటుంది. సత్యం, ధర్మం, దయ, అహింసలను అభివృద్ధి చేసుకొంటేనే భక్తుడు భగవంతునికి చేరువ కావటము సుసాధ్యమని గీతాచార్యుడు ప్రబోధించాడు. పరిపూర్ణావతారుడైన భగవంతుని పొందాలంటే, మనసులో పరిపూర్ణ ప్రేమతత్త్వాన్ని, పరిపూర్ణ విశ్వాసాన్ని పెంపు చేసుకోవాలి.

శ్రీకృష్ణ ప్రేమ తత్త్వము పూర్ణతమంగా, బాల్య దశలో, జలక్రీడలలో వ్యక్తం చేశారు. మహిమాన్వితమైన స్వామి ప్రతిచర్య ప్రేమ తత్త్వముతో నిబిడీ కృతమై ఉన్నది. బాల కృష్ణుని వధించటానికి వచ్చిన రాక్షసులకు తన ప్రేమ

తత్త్వముతో, అమరత్వమును ప్రసాదించాడు. కాళింది మడుగును విషపూరితం చేసిన కాళీయునికి తన స్పర్శా భాగ్యమును ప్రసాదించి, అతని శిరస్సుపై, అనితర సాధ్యము, అపూర్వ భాగ్యమైన తన చరణ కమలముద్రలతో పునీతుణ్ణి చేశాడు.

స్త్రీ, పురుష వ్యత్యాసము, వయోవ్యత్యాసము, వర్గ భేదము, సిరి సంపదలతో నిమిత్తము లేకుండ, తన్ను గాఢంగా విశ్వసించిన వారందరికి బ్రహ్మానందమనే నవనీతమును పంచిపెట్టాడు. చిల్లర దేవుళ్ళకు, మ్రొక్కనవసరము లేదని, చిదానంద స్వరూపుడైన చిన్ని కృష్ణుని సేవిస్తే, వారి జీవితాలు ధన్యమవుతాయని, అద్వైత సిద్ధాంతమును ప్రతిపాదించాడు. పరిపూర్ణమైన, నిష్కళంకమైన ప్రేమతత్వము జాతి, కుల, వర్గ, లింగ భేదముల కతీతమైనదని ప్రత్యక్షముగా నిరూపించాడు. పసికందులు మొదలుకొని వృద్ధుల వరకు కన్యలు, పడచులు, ప్రౌఢలు, వృద్ధ స్త్రీలు, ధనిక వర్గము, కటిక దరిద్రులు, గోపబాలకులు మొదలుకొని వారి తాత, ముత్తాతలు, గోవులు గోవత్సములు మున్నగు సర్వ జీవులు కృష్ణ దర్శనముతో, కృష్ణ స్పర్శతో, కృష్ణ నామస్మరణతో తమ వ్యక్తిత్వాన్ని, పూర్తిగా కోల్పోయి, అవ్యక్తమైన, దివ్యానుభూతిని పొందారు. అదంతా కృష్ణ పరమాత్మ దివ్యానుగ్రహమే. కృష్ణ జ్యోతి, అఖండ జ్యోతి. ఆ అఖండ జ్యోతికాంతితో వ్రేపల్లెవాడలోని సర్వ జీవకోటి తమ జీవితాలలోని అజ్ఞానాంధకారమును పారద్రోలుకుని, కాంతిమయం చేసుకొన్నారు. కృష్ణ పరమాత్మ నిష్కళంక ప్రేమమూర్తి. శ్రీ కృష్ణ భక్తులందరూ ప్రేమతత్వోపాసకులు, ప్రేమ యోగులు. కృష్ణ పరమాత్మ బాల్య దశ పూర్ణతమమైన, మహిమాన్విత ప్రేమ యోగమునకు ప్రతీక. అందులో రస పంచాధ్యాయిగా ప్రసిద్ధి చెందిన రాసక్రీడా ఘట్టము మకుటాయమానమైనది. శరత్కాల పున్నమినాడు యమునా తటిపై మురళీగానమాలాపించగా ఆగాన మాధుర్యం వీనులకు సోకగానే మైమరచిన గోపకాంతలు తమ దివ్యనాథుని చేరుకోవాలనే తమకంతో వడివడిగా యమునా తటికి చేరారు. అక్కడ వెన్నెలపోగులా, అనంత ప్రేమవాహినిలా వర్షించే వేణుగానంలో తనువు, మనసు మరచి, పరవశించి, తమ వన్నెకాడు, వెన్నదొంగ వలపు చూపులలో కరిగిపోయారు. వంశీమోహనునికి వశీకృతలై పోయారు. ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కొక్కడై తోచుభంగి! బాల కృష్ణుడు దివ్య ప్రేమ కిరణాలతో ఒక్కొక్క గోపికకు ఒక్కొక్క కృష్ణునిగ గోచరించాడు.

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

**12. శ్లో॥ నిఖిల భువన లక్ష్మీ నిత్య లీలాస్పదాభ్యాం**
**కమలవిపిన వీధీ గర్వ సర్వఙ్కషాభ్యామ్,**
**ప్రణమదభయ దానప్రౌఢి గాఢోద్ధతాభ్యాం**
**కిమపి వహతు చేతః కృష్ణ పాదామ్బుజాభ్యామ్ ॥**

తల్లి చేసే పనులన్నీ చూస్తూ, మూతి ముడుచుకుని, ముత్యాల పీటమీద కూచుని ఉన్నాడు, ఆమె ముద్దుల తనయుడు. యశోదమ్మ తన కుర్రాడి కాళ్ళకి గోరింటాకు పెట్టింది. చెదిరిపోతుందని వాడిని బెదిరింపులతో లాలింపులతో కదలకుండా కూచోపెట్టింది. అసలే ఒక చోట కాలునిలవదయ్యె! ఎంత సేపు అలాగ కట్టేసినట్లు కూచుంటాడు! కన్నయ్యకి విసుగొస్తున్నది.

ఎలాగో పసిమిరంగు గోరింటాకు నలుపురంగుకి తిరిగి ఎండి పోయిందని నిర్ధారించుకున్న తల్లి పిల్లాడి కాళ్ళు చేతులు కడిగింది. చీకట్ల వెనక అరుణోదయమైనట్టు నల్లనయ్య చేతులు పాదాలు ఎరుపురంగులో మెరిసిపోతుంటే చూసిచూసి మురిసిపోయింది , తన దిష్టే తగులుతుందేమోనని భయపడుతూ. చిలిపి కృష్ణుడికి స్వేచ్ఛ లభించినట్లయింది, గానీ ఇంకా పూర్తి కాలేదన్నట్లుగా యశోదమ్మ చేతులకి, కాళ్ళకి కంకణాలు, ఉంగరాలు, కడియాలు, అందెలు, గజ్జెలు అన్నీ అలంకరించ సాగింది. ఇహ లాభంలేదనిపించి అమ్మమీద పుట్టెడు కోపం రాసాగింది బంగారు కొండకి. ఆవిడకేం తెలుసు? తనని ఎవరెవరో తలుస్తుంటారు, పిలుస్తుంటారు, కొలుస్తుంటారు, వారందర్నీ ఎలాగ ఆదుకోవటం, ఆనందపరచటం, అక్కున చేర్చుకునే అదృష్టాన్ని ప్రసాదించటం? ఇలాగ ఇక్కడే బిగిసిపోయి ఉంటే ఎలాగ? కొంటె కృష్ణుడికి అవకాశం చిక్కింది అంతలో.

ఎదురింట్లోంచి ఒక పిల్లి వాళ్ళింట్లో వెన్నంతా తినేసినట్టుంది, మూతి రాచుకుంటూ బైటకి వచ్చి ఎటో వెడుతోంది. కనుకొనలనించి దాన్ని గమనించిన కన్నయ్య ఆ పిల్లి వేపు ఒక చూపు విసిరాడు. అది బాణంలాగ పనిచేసి పిల్లిని కన్నయ్య వైపు ఆకర్షించింది. బాలుని దగ్గిరగావచ్చి వాని కళ్ళలో ఆజ్ఞను గుర్తించిన మార్జాలం తల ఊపి వంటింట్లోకి వెళ్ళింది. దాన్ని చూడని యశోదమ్మ వంటింట్లో కడవ దొర్లిన చప్పుడు విని అబ్బాయికి చేస్తున్న అలంకారం ఆపేసి గబగబా లోనికి వెళ్ళింది. కర్రతో బెదిరించే సరికి పరిగెత్తి వచ్చిన పిల్లిని మెచ్చుకోలుగా చూసి దాని వెనకే వీధిలోకి ఒక్క గంతులో వెళ్ళి

పోయాడు కృష్ణయ్య. యశోదమ్మ వచ్చి చూస్తే పీటమీద పిల్లాడు కనబడలేదు. చోద్యంగా చూసి బుగ్గలు నొక్కుకుంటూ ఉండిపోయింది యశోదమ్మ.

ఉదయభానుని లేతకిరణాలు సోకి చక్కలిగింతలు పెట్టినట్లయి రేకులు విప్పి పకపక నవ్వుతూ పద్మాలన్నీ చుట్టూ చూశాయి. ప్రతిదానికీ తన ప్రక్కనున్న కమలం ఎంతో అందంగా కనిపించింది. ఎంత అందంగా ఉన్నావో! అనుకున్నాయి ఒకదానితో ఒకటి. నిజమా! నా అందం నేను చూసి తీరాలే అనుకుంటూ కింద ఉన్న నీళ్ళలో తమతమ ప్రతిబింబాలను తనివితీరా చూసుకున్నాయి. వాటన్నిటి అందాలు, ఆనందాలు చూస్తున్న నదీమతల్లి "నా బిడ్డలారా! ఎంతో చక్కదనమే కాదు, ఇంకా గొప్ప ఐశ్వర్యం మీకు వరంగా లభించింది. అదేమంటే ముల్లోకాలకు తల్లి అయిన లక్ష్మీదేవి అవతరించి, ఆసనంగా స్వీకరించిన పదవీభాగ్యాన్ని పొంది ఉన్నారు మీరు." తల్లి మాటలు వింటూ పొంగిపోయిన సరోజాలన్నీ రోజంతా తమనితాము పొగుడుకుంటూ ఉండిపోయాయి. క్షణక్షణం వాటిలో అహం పెరిగిపోసాగింది.

"తాతా ! లోక పూజ్యుడవై దైవస్వరూపుడవైన నువ్వు మాకు బంధువు కావటం మా అదృష్టం. నీ కుమార్తె, మాకు తల్లీ అయిన యమునమ్మ మన బాంధవ్యాన్ని చెప్పి కర్మసాక్షివైన నువ్వన్నీ గమనిస్తుంటావని తెలిపింది. ఇప్పుడు మా గొప్పదనం చూశావు! తుమ్మెదలు హంసలు అన్నీ కోరి మా చేరువకి వస్తుంటాయి. అందమూ, ఆకర్షణమూ అమ్మలగన్నమ్మ అయిన సిరికి పుట్టిల్లనే ఉన్నత పదవీ సౌభాగ్యం పెట్టి పుట్టిన మేమెంత అధికులమో కదా! నువ్వే చెప్పు మాకు సాటి ఎవరైనా ఉన్నారంటావా?" మిడిమిడి జ్ఞానంతో మిడిసి పడుతూ తన నుద్దేశించి పలికే పద్మాలను చూస్తూ సూర్యభగవానుడు నవ్వుకున్నాడు. అంత అహంకారం పనికిరాదు. మీ పొగరణిగే తీరుతుంది లెమ్మనుకుంటూ "చూడండమ్మా లోక పాలకుడినైన నేను నడిమింట నిలిచినపుడు నా ప్రతాపమంతా చూపినా, సాయం సమయానికి పడమట దిక్కుకు వాలిపోయి నా శక్తినంతా ఉపసంహరించుకోక తప్పదు. ఎక్కడ శిరస్సు గర్వంతో తలెత్తుతుందో అక్కడ విధిని శాసించే శక్తి శిక్షణ అమలు జరిగి తీరుతుంది. ఆ శక్తికి ఎంతవారైనా తలవంచక తప్పదు. అహంకారానికి ఎప్పుడూ అపజయమే సుమా. గుర్తుంచుకోండి" అంటూ నదీతీరం వైపు చూపిస్తూ 'అటు చూడండి' అన్నాడు. సూర్యుని మాటలు వింటూ బారులు తీరిన తామరలన్నీ అటు చూశాయి. నీలమణి వర్ణంలో మెరిసే బాలుడొకడు అక్కడ కూర్చుని నీటిలో పాదాలు ముంచి ఆడుకుంటున్నాడు. - సశేషం

# మౌనధ్యాన సప్తాహశిబిరం

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

శ్రీగురుదేవులు మనం ధ్యానం చేయాలి అని చెప్పారు. ఎలా చేయాలి అనే విషయాన్ని ఇంతవరకు మనకు పరమహంస పరివ్రాజక పూజ్యపాద శ్రీ 108 దండి నిర్మలానందగిరిస్వామివారు అందించారు. చూచేవారికి ధ్యానము, జపము, స్మరణ, విచారణ ద్వారా వారు ప్రపంచంలో ఉన్నట్లు కనిపించినప్పటికీ వైరాగ్యం స్వరూపం ధరించి వచ్చినటువంటివారు మహాత్ములు. సాధకుడికి ముందర సాకార భక్తి అవసరం. తను నమ్మిన దేవుడి మూర్తి అనేటువంటిది అవసరం. ఎంత వరకు ఈ దేహంమీద దృష్టి ఉంటుందో అంత వరకు అక్కడ మనం ఆశ్రయించిన పాదము, మూర్తి ఉంటాయి. దాన్ని గుర్తిస్తూ ఉంటుంది మనస్సు. ధ్యానంలో మనస్సుయొక్క ఏకాగ్రత అంటే మనోలయం ఉంటుంది. ముక్తిలయం యథార్థః అని శాస్త్రం చెప్పినట్లుగా మనస్సు ఎక్కడ లయిస్తుందో అక్కడ శరీరమనేది తెలియదు. నామం చేస్తున్నాము అనేది కూడ తెలియదు. అసలు దానిని చూడము కూడ. జపము అనేది కూడ అక్కడ ఆగిపోతుంది. కాని ఆ స్థితిని పొందినవారు చూసేవాళ్ళకు ఈ లోకంలో మామూలుగా కనిపిస్తున్నప్పటికి, తాము మాత్రం అలౌకికమైన ఆనందలహరిలో ఓలలాడుతూ ఉంటారు. భగవంతుడు అటువంటి స్థితి సహజంగా ఎలా ఉంటుందో చూపించటానికి మనందరకు నిద్రను ఇచ్చాడు. నిద్ర తెలియనివాడు ఉండడు. కాకపోతే నిద్రపోయేముందు తనయొక్క మానసిక స్వభావాన్ని ఆలోచిస్తూనే ఈ పని అయింది, ఆ పని అవ్వలేదు, ఆ లైటు తీశాను, ఈ లైటు తీయలేదు, ఈ తలుపు వేశానో లేదో అని వేసినవాళ్ళకే, మనకే అనుమానం వస్తుంది. అన్నీ వరుసగా చూసుకుంటూ వచ్చిన తరువాత ఆఖరిన క్రింద గడియ వేశామా లేదా అని అనుమానం వస్తుంది. ఇటువంటి వారితో తిరిగి తిరిగి తిరగరాయి అయిపోయి వచ్చి అలసిపోయి భగవంతుడిచ్చిన ప్రసాదంగా నిద్ర పోతున్నాడు. మళ్ళీ లేస్తున్నాడు. దినచర్య జరిగిపోతుంది. ఇలాగ మన జీవితంలో ఎన్నో ఏళ్ళుగా నిద్రపోతూ, నిద్రలేస్తూ వస్తున్నాము. కాని ఇన్ని పనులు చేసినా కలగని రెస్ట్ అంటే విశ్రాంతి నిద్రపోయి లేస్తే కలుగుతుంది. నిద్ర లేచాక ఫ్రెష్‌గా ఉంటున్నాము. ఎందుకని? మనసు పనిచేయటం లేదు అక్కడ. మనసు అణగి ఉన్నది. బాహ్య విషయాలవైపు పరిగెత్తకుండా ఇంద్రియాలతో సహా అది

సుషుప్తిలో అణగిపోతున్నది. అక్కడ ఆగి పోతున్నది. మళ్ళీ కల వస్తే అది తన కల ప్రపంచాన్ని సృష్టించుకుంటున్నది.

ఇటువంటిది ఎప్పుడు కలుగుతున్నది? మానవుడు బాగా సమస్యలతో ఉంటే నిద్ర పోతున్నాడా? నిద్ర పట్టదు. బోలెడన్ని సమస్యలు. నిద్ర పట్టలేదని కాదు. దానికి చాలా ఉంటాయి. మందు మాత్రలు ఉంటాయి. చాలా అష్టకష్టాలు పడతాడు. బాగా శరీరం అలసిపోయి అఖరికి నిద్ర పడుతుంది. దానికి చాల అదృష్టం ఉండాలి. సమస్యలెక్కువ ఉన్నా కొంతమంది బాగా నిద్రపోతుంటారు. దేని స్వభావం దానిది. కాని అటువంటి వారికి కూడ నిద్రలో దుఃఖపూరితమైన, విపరీతంగా హడలుగొట్టే కలలు వస్తాయి, మనస్సు వర్రీ (worry) చెందినప్పుడు. ఎలా అయితే మనకు జీవితంలో ఆ నిద్ర ఇచ్చాడో భగవంతుడు, అలాగే జాగ్రదవస్థలో మనకు, అన్నీ తెలుస్తున్నప్పుడే వాటి యందు మనసు లేకుండా ఉండే స్థితిని కూడ ప్రసాదించాడు.

మహాత్ముల సూచన మేరకు వెడితే చాలు. అటువంటి స్థితిని మనం అందుకోగలుగుతున్నాము. దానినే ధ్యానం అన్నాము. ధీ యానం, బుద్ధి యొక్క ప్రయాణం ధ్యానం. అటువంటి ధ్యానం ఎక్కడ ఉన్నది అంటే బయట వెతికితే ఉండటంలేదు. నమ్మకంతో ఆ మూర్తియందు విశ్వాసాన్ని మనస్సులో ఉంచుకుంటే మనస్సు ఏకాగ్రత చెందుతుంది. మరి ఆ మూర్తి ఎక్కడ ఉంటే మనకు స్థిరమైన ఆనందం కలుగుతుంది? మీ ఇంట్లో ఉంటే బాగుంటుందా? మా ఇంట్లో ఉన్నా కూడ బాగుండదు. ఏ ఇంట్లో ఉన్నా ఈ ఇంట్లో (దేహంలో) ఉన్న గురుదేవుడి అసలు స్వరూపాన్ని హృదయం గుర్తించాలి. ఇందులో ఉన్న దేవుడికి ఆచారవ్యవహారాలు లేవు. ఆ హృదయ మందిరానికి తలుపులు వెయ్యాలి అనేది లేదు. ఇందాక స్వామివారు చెప్పారు, అహంకార మమకారాలు అనే తలుపులు తీయాలి అని. ఎందుకంటే నిత్యమూ మన వెంటనంటి ఉండి మనను అశాంతి పాలు చేసేవి ఆ అహంకార మమకారాలే కదా! నేను, నాది అనేవి. అందువలన వాటినే తలుపులుగా పెట్టుకున్నారు, ఆ రెంటినీ తీసివేయమని. తలుపులు తెరవమంటే, తెరిచి వాటిని మొత్తం లేకుండా చేసికోమని. ఆ మనస్సుకు అడ్డుగా ఉన్న మానసికమైన అహంకార, మమకారపూరితమైన తెరను ఎప్పుడైతే తొలగించుకుంటామో, అప్పుడు మన పాటలో ఉన్నది.....

-సశేషం

# మాతాజీ బోధామృతం

(గతసంచిక తరువాయి) - శివ ప్రసాద్

( శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయంలో ది. 28-09-09 శ్రీ మాతాజీవారి అనుగ్రహ భాషణకు సంగ్రహ రూపం)

ఇందులో రెండు పరమార్థాలున్నై. మొదటిది భగవన్నామం. రెండవది ఏవైనా బంధాలు ఉంటే అవి వదులుతై.నామ స్మరణ ధనమే ధనము. మనందరం ఆస్తికులమే. ఎవరన్నా నాస్తికులము అనుకున్నా, నాస్తికత్వంలో కూడ ఆస్తికత్వం ఉన్నది. ఉండబట్టే లేదని కూడ అనిపిస్తున్నది. అసలు లేకపోతే చెప్పేదేమున్నది? మనందరం ఆస్తికులం అయి ఉన్నాము. ఉన్నది పరమాత్మ ఒక్కటే అని నమ్ముతున్నాము. అటువంటి ఆస్తికులైన తల్లిదండ్రులకు పుట్టటము మన అదృష్టం. ఇక మహా పురుషులు లభించటం అనేది ఎన్నో జన్మల అదృష్టం.

స్వామి అనేవారు, 'మా అమ్మకు తెలుసు' అని. మనం కూడ చెప్పుకుంటాము, 'మా కన్నకు తెలుసు, ఎప్పుడు ఎవరిని ఎక్కడికి చేర్చుకోవాలి అనేది' అని. రాత్రికి రాత్రే వెళ్ళాలనుకునేవారితో కూడ, 'పెద్ద వర్షం పడితే ఏం చేస్తారు? ప్రస్తుతానికి ఉరుములు, మెఱుపులతో ఉన్నది. ఇక్కడ ఇంతనామ స్మరణ జరుగుతుంటే వాడు ఆనందించి వర్షించక పోతాడా? అందరికీ ఆనందం వర్షించవద్దా! వాడు తప్పక వర్షించటం మొదలు పెడ్తాడు'అనేవారు. వానరాకడ ప్రాణం పోకడ తెలియదంటారు గదా! కాని బాబుకు తెలుసు, ఏ సమయానికి ఏది ఇవ్వాలో. ఇప్పుడు ఇక్కడ దిగ్బంధనం చేసి, నామం అనిపిస్తున్నారా లేదా? అందుకే ప్రకృతి కూడ పులకరిస్తున్నది.

నామస్మరణ ధనం పెద్దల వద్దనుండి రావచ్చు. మనకు మహాత్ముల ద్వారా వచ్చింది. తరువాత మహాత్ముల సంశ్రయం ద్వారా ముక్తి మార్గం లభిస్తుంది. ఇంద్రియాల ప్రభావానికి, మనస్సుకు లొంగకుండా ప్రశాంతంగా జీవించటమే ముక్తి. అంతేగాని ముక్తి అంటే అదేదో సర్టిఫికెట్(certificate) అనుకోకండి. దీనికి కాపీలు(copies) లేవు. ఎన్ని సార్లు ఒరిజినల్ (original) ఇచ్చినా అది తరగనిది. ఇది ప్రకృతికి సర్వనాశనం కాకుండా ఉండటానికి అనుగ్రహించి అమ్మ ఇచ్చిన అవకాశం. మనం దానిని బుట్టదాఖలు చేస్తున్నాము. మనం ఏదైనా ఎప్పుడు చేస్తాము? అందులో మనకు ఏదో ఉన్నది అనుకుంటే. కాని మనం ఉన్నది అనుకున్నది ఉంటుందన్న గ్యారంటీ ఎక్కడ

ఉన్నది? నామస్మరణ ధనం ఎంత ఖర్చుపెట్టినా, ఖర్చుకాకుండా మన ఇల్లు బంగారం అవుతుంది. మనకు కావలసిన వాళ్ళ ఇల్లుకూడ బంగారం అవుతుంది. ఏ బంగారం? జీవిత పరమార్థాన్ని కొంగు బంగారం చేసేది.

**తృణాగతి సునీచైవ తరువపి సహిష్ణుణా ।**
**అమానినామ సాదీనా । కీర్తనీయో సదా హరిం ॥**

హరిని ఎలా స్మరించాలి. నేను గడ్డిపోచకన్నా హీనమైనవాణ్ణి ప్రభూ! నీ నామం లేకుండా నేను ఉండగలనా? ఈ మానవ జన్మ వచ్చినందుకు పూర్తిగా నీ నామానికి అంకితం అవుతాను. చెట్టు తనను నరుకుతున్నా, ఓర్పుతో సహించి, నీడను ఇస్తుంది. పుష్పాలను, ఫలాలను ఇస్తుంది. నాకు అటువంటి ఓర్పును ప్రసాదించు ప్రభూ! ప్రపంచంలో ఈనాడు జరుగుతున్నవి చూస్తే భయం కలుగుతున్నది. ఏ అవమానములు, అపవాదులు వచ్చినా, వాటిని సహించే శక్తిని ప్రసాదించు ప్రభూ!అని నిరహంకారంగా దీనంగాహరిని సదా కీర్తించాలి.

ఎన్ని చేశాను అనే లెక్కకు తావివ్వలా మహాత్ములు. నేను ఇన్నిసార్లు జపమాల తిప్పాను, ఇన్ని లక్షల నామాన్ని చేశాను, అని లెక్కకోసం చేస్తే ప్రయోజనం లేదు. ఆయన నామాలలో అగణిత గుణగణాయ నమః అని ఉంది. నామస్మరణ, నామధనం నిత్యం అని వారు మనకు నామధనం అందించారు.

కొందరు మంత్రాలు ఆడవాళ్ళకు చెప్పవచ్చా? అంటారు. ప్రపంచంలో అవివేకులు కూడ ఉంటారు. కాని ఎప్పుడైతే నీవు ఈ మార్గంలో ప్రయాణించ దలచుకున్నావో, అప్పుడు గురుదేవులు మహావాక్యాలను కూడ బోధించారు. బోధించి, నీవు స్టేజి (stage) ఎక్కి వీటిని అందరికీ బోధించు అని చెప్పారు. ముసుగుచాటు బేరం లేదు. ఎప్పుడు సంకీర్తనం మీద దృష్టిపోతుందో, అప్పుడుగాని మనకు అందులో భక్తి అమృతం ఆస్వాదన లభించదు. భక్తి లేకపోతే సంగీతం ద్వారా ముక్తి దొరుకుతుందా?

ఆ భక్తి ఫలమైన ముక్తి, నీవు ఎందులో ఉన్నా హాయిగా ప్రశాంతతను అనుభవించేలా చేస్తుంది. జనకుడు మహారాజై ఉండి కూడ, అటువంటి శాంతిని అనుభవించాడు. రాక్షసుడై ఉండి కూడ విభీషణుడు, కౌరవులలో ఉండి కూడ విదురుడు, ఆ శాంతిని అనుభవించారు. వాళ్ళకెందుకు దొరికింది శాంతి? వారు పవిత్రమైన అంతఃకరణం కలిగి ఉన్నందువలన కామమునకో, క్రోధమునకో, శోకమునకో వాళ్ళ మనస్సులు చలించలేదు. అందుకనే ఎక్కడ ఉన్నా, ఈ నాటికీ వారి చరిత్రలను సువర్ణాక్షరాలతో లిఖించుకుంటాము. అందుకే ధర్మశాస్త్రం కూడ వారిని అంగీకరించింది. -సశేషం

# మాతాజీ సత్సంగ్ డైరీ

(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

చిన్నపిల్లవాడికి నీళ్ళు పోస్తూ, వాడిలో బాలకృష్ణుణ్ణి దర్శించు. వాడు పరిగెత్తి పోతుంటాడు. 'పరుగు పరుగున రావోయి బాలకృష్ణ' అని వాణ్ణి బ్రతిమాలుకుంటే, వాడే వస్తాడు. పిల్లవాడి ముక్కుకు చీమిడి ఉంటే తీసి గోడకు రాయటం కాదు, మీ చీరలతో ఆ ముక్కు తుడిచే ప్రేమ రావాలి. కొంతమంది తీర్థం ఒలకపోసుకుంటారు. దానిని తుడవటానికి కట్టుకున్నది పట్టుచీర అనే అనుమానం రాకూడదు. పట్టుచీర ఎక్కువా? తీర్థం ఎక్కువా? గురుదేవులు కష్టే ఫలే అని చెప్పారు. సర్దుబాటు చేసుకుంటే అదే గీతాసారం అవుతుంది. మన జీవితం నలుగురికి ఉపయోగపడేలా చేసుకుంటే అదే గీతాసారం. దేహానికి నీవు ఎంత సమయం ఇస్తున్నావు? భగవంతుడికి ఎంత సమయం ఇస్తున్నావు? ఉదయం లేవగానే, కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేసి అంబరీషుడు, నామదేవుడు, జ్ఞానదేవుడూ, రామకృష్ణ పరమహంస, వివేకానంద, కబీర్‌దాస్, కమాల్‌దాస్, మీరా, సూరదాస్, వంటి భక్తుల నామం ఒక్కసారి తలచుకున్నా చాలు అనేవారు గురుదేవులు. వారు నడచిన మార్గంలో నడిస్తే చాలు మనం తరించటానికి. కాని మనం అలా చేయక, శ్లేష్మంలో పడ్డ ఈగలాగా కొట్టుకుంటున్నాము. వీటన్నిటి మధ్యలో తనను తాను తెలిసికొనే ప్రయత్నమే సత్సంగానికి మూలం. నీ జీవితంలో శాంతిని ఇచ్చేది, సంపదలు, హోదా, కీర్తి ప్రతిష్ఠలు, చక్కని భార్య వంటివి ఏవీ కావు. వీటన్నిటినీ భగవంతుడికి భగవన్నామానికి వినియోగిస్తేనే శాంతి వస్తుంది. భగవన్నామం చేయటానికే మనకు భగవంతుడు జ్ఞానేంద్రియాలనూ కర్మేంద్రియాలనూ ఇచ్చాడు. నీవు ఆ బాటలో వాటిని సద్వినియోగం చేస్తే నీకు చిత్తశాంతి అక్కడే కలుగుతుంది.

ఈ ఆత్మవస్తువు పూలకు, పండ్లకు లొంగేది కాదు. నీ మనస్సును నిష్కల్మషంగా చేసి దానిని భగవంతుడికి అర్పిస్తే అప్పుడు నీవు నిజంగా ఎవరో తెలిసికొనే శక్తి నీకు వస్తుంది. నీ రెండు చేతులనూ భగవంతుడి రెండు పాదాలపై ఉంచు. పనులు చేయవలసి వచ్చినప్పుడు, నీ కుడి చేతితో ఆ పనులు చేసికొని పని అయిపోగానే, మళ్ళీ ఆ చేతిని కూడ తెచ్చి ఆ పాదాల మీద ఉంచు. చేతులు ఉంచటం అంటే నీ మనస్సును ఉంచటం అని అర్థం.

చావటం మన అంతిమ లక్ష్యం కాదు. బ్రతికి ఉండగానే చచ్చిపోవాలి. అంటే నేను ఈ దేహాన్ని అనే దేహ భావనను విడిచి పెట్టటం. ఈ బోధ ద్వారా దేహ వాసన పోతుంది. అంతే కాని చేతులు కాల్చుకుంటే పోదు. దేహం మీది మోహాన్ని వదిలించే వాడే మోహనాకారుడు. ఆ మోహనాకారుడి మీద ధ్యాసను ఏకాగ్రం చేసి, దానిని ధ్యానంగా మార్చి, మన జీవిత లక్ష్యమును సాధించెదముగాక. *

## మమత్వానికి కారణం

స్వా॥ నిత్యానందులు - "గోపీచందు తల్లి మేనావతి. ఆమె గొప్ప విదుషీమణి; పూర్ణవైరాగ్య వంతురాలు. ఆమె కుమారునకు తాను నేర్పిన వైరాగ్య పాఠమును దిట్టము చేయుటకు వానిని భర్తృహరిచెంత నుంచెను. కొలది కాలము ఆముగ్గురు ఒక చోటనే ఉండిరి. మేనావతి తన కుమారుని వైరాగ్య పరిస్థితిని తెలిసికొన దలచి ఒకనాటి రాత్రి సమయమున ఇతరులకు తెలియకుండా పురుషవేషము ధరించి గోపీచందునకు కొంచెము దగ్గరగా పరుండెను. గోపీచందుడు మేల్కొని దగ్గర పరుండిన పురుషుని జూచి 'నాకు దగ్గరగా పరుండిన దెవరు? లేచి వెడలిపొండు' అనెను. వెంటనే మేనావతి లేచిపోయి భర్తృహరి దగ్గరగా పరుండెను. భర్తృహరి అచటినుండి లేచి మరియొక చోటికి పోయి నిద్రించెను. మరునాటి ఉదయమున భర్తృహరి, గోపీచందుడును కూర్చొనియున్న సమయమున మేనావతి రాత్రి జరిగిన వృత్తాంతమును వినిపించెను. ఆమె గోపీచందునితో నిట్లనెను. నీవు రాజ్యమును విడచి త్యాగివిగా అరణ్యములో నివసించుచున్నావు. కాని నీయందు మమత్వము ఇంకా పోలేదు. నీవు పరుండిన భూమిని నీదిగా భావించితివి. ఈ మమత్వమునకు కారణము నీకు ఇంకను సరియగు వివేకము కలుగకపోవుటయే అని చెప్పి మేనావతి గోపీచందునకు కలిగిన వైరాగ్యమును దృఢపరచెను. భర్తృహరి మహారాజు వివేకముతో కూడిన వైరాగ్యముతో అరణ్యమునకు వెళ్ళెను. అందుచే ఆయనయందు లేశమైనను మమకారము లేదు. గోపీచందుడు తల్లియుపదేశమున రాజ్యమును విడనాడి వనమునకు వెళ్ళెను. అతని యందలి వైరాగ్యము వివేకరహితమైనందున కొంచెము మమకారము మిగిలియుండెను. రాజ్యసుఖమును విడనాడి అరణ్య వాసము చేయు మహాపురుషులందే మమకారము మిగిలియుండ మావంటివారి సంగతి ఏమని చెప్పవలెను."

-వార్తాలాపము

# శ్రీ బాబూజీ దివ్యవాణి

రాధ హృదయంలో అంకురించిన ఈ అసూయ అంతకంతకూ వృద్ధిచెంది పెను వృక్షంగా విస్తరిల్లుతూ వుండేసరికి, ఈ కూడని భావాలు తనలో చెలరేగుతున్నందుకు ఆమె ఎంతగానో బాధపడసాగింది. అయితే, ఈ విషయం కృష్ణుని ముందు ప్రస్తావించటానికామెకు ధైర్యం లేకపోయింది. ఇందువలన అతడు తనను చిన్నచూపు చూస్తాడేమోనని ఆమె భయం. అందుచేత, ఈ సంగతి నేరుగా వేణువునే అడిగి తెల్సుకోవాలని ఆమె నిశ్చయించుకొన్నది.

కాని, కృష్ణ సాన్నిధ్యం లేకుండా వేణువుతో ఏకాంతంగా మాట్లాడడం ఎలా? దానినెప్పుడూ ఆయన వదిలి ఉండడాయే! ఇటువంటి క్లిష్టపరిస్థితులలో భక్తులకు, హృదయపూర్వకమైన ప్రార్థనమార్గమొక్కటే శరణ్యం. అందుచేత, రాధ తనను ఈ చిక్కులో నుంచి తప్పించమని కృష్ణుని తన మనస్సులోనే వేడుకొన్నది. ఆమె కోరుకున్నట్లుగానే ప్రభువు అందుకు తగిన సన్నివేశమును కల్పించాడు.

ఒకరోజున రాధ శ్రీకృష్ణుణ్ణి, యమునానది ఒడ్డున ఇసుక తిన్నెపై వేణువును చేతిలోనే ఉంచుకొని నిదురిస్తూ వున్నట్లుగా కనుగొన్నది. అది నిజంగా నిద్రయేయని కొన్ని లక్షణాలను బట్టి తాను తెల్సుకొన్న మీదట, సద్దు చేయకుండా నెమ్మదిగా ఆయనను సమీపించింది. వేణువు ఆయన చేతిలోనే ఉన్నా, ఆ అరచేయి పట్టు సడలి ఉన్నది. ఇదే సమయమని నెమ్మదిగా ఆ వేణువును సంగ్రహించి, సమీపాన గల ఒక నికుంజంలో కూర్చుండి దానినిట్లు సంబోధించడం మొదలు పెట్టింది. లలితములైన తన కరాంగుళులతో దానిని లాలన చేస్తూ, "ప్రియమైన ఓ మురళీ, నీవెంత భాగ్యశాలినివి! నిద్రలోసైతం ప్రభువు నిన్ను వీడి ఉండడు కదా, ఎవరైనా ఇది నిజంగా గర్వించకోదగిన విషయం. ఏమంటావు?"

వేణువు మెల్లగా ఇట్లు సమాధానం చెప్పింది. "అయితే, ఈ భాగ్యప్రాప్తిని పొందే యోగ్యత నాలో ఏమున్నది? నాకు తెలిసినంతవరకు, భగవానుని దయకు పాత్రం కాగల యోగ్య లక్షణాలు నాలో ఏమీ లేవు. చిల్లులతో కూడిన యీ వెదురు గొట్టంపై కేవలం జాలితో భగవానుడిలా

అనుగ్రహించాడు, అంతే! ఆయన అనంత కరుణామూర్తి.''

"అయితేనేమి, ఆయన నిన్నింతగా కరుణించుటకు నీలో విశేషం ఏదో ఉండితీరవలె. దయతో నీ రహస్యం నాకు చెప్పవా?''అని అడిగింది రాధ.

"నేను చెప్పినది విశ్వసించు రాధా! నాలో నిజంగా ఏమీ లేదు. నేను వట్టి ఖాళీ గొట్టాన్ననీ, అందు దాగివుండేదేమీ లేదని నీకు తెలియదా?'' అన్నది వేణువు.

వేణువు విజయానికి కారణమదియే రాధా! తనలో ఉండే సమస్తమునూ అది ఖాళీచేసుకొని నిర్మల హృదయం సంపాదించుకొన్నది. మంచి చెడ్డలు, రాగద్వేషాలు, ఆశా నిరాశలు, లజ్జా గర్వములు, మొదలైన వాటికి అందు ఏమాత్రం తావులేదు. భగవంతునికి ఇష్టమైన దదియే - నిర్మల హృదయం, ద్వంద్వాతీతమై సమతా దృష్టి గల అంతఃకరణం. అది వెదురుతో చేయబడితేనేమి, బంగారంతో చేయబడితే నేమి? త్యాగమొక్కటే ముఖ్యం - నా అధరామృతమునది గ్రహించే వేళ తనకొరకు ఏ మాత్రమూ అట్టే పెట్టుకోకుండ, ఆ గాన మాధుర్యమును చుట్టూ వున్న చరాచర జగత్తునకు విరివిగా విరజిమ్ముతున్నది. ఇందుకొరకే తన తనువును చిల్లులు పడజేసుకొన్నది. ఈ త్యాగానికి ప్రతిఫలము అది ఏ మాత్రమూ కోరడంలేదు. నాకు సదా సదా సన్నిహితంగా ఉండాలనే కోరికసైతం దానికి లేదు. అందుకే నేను దానిని ప్రేమించి నా దగ్గరనే ఉంచుకొంటున్నాను. క్షణమైనా దానిని విడనాడ నొల్లను. అట్టి త్యాగం నాకత్యంత ప్రేమాస్పదం.

ఈశ్వరవాణియైన ఉపనిషద్బోధ కూడా ఇదే. కేవల మోక్షాపేక్ష సంకల్పో మోక్షః సంకల్ప మాత్ర బంధో బంధః అని నిరాలంబోపనిషత్తు. అనగా ఏ మాత్రపు సంకల్పలేశము ఉన్నా అది బంధమే. మోక్షాపేక్ష సైతమూ బంధమూ బంధకమే అవుతుంది. ఎట్టి సంకల్పమూ లేక ఉండే స్థితియే చరమ మోక్షం.

హృదయమునూ బుద్ధినీ అత్యంత నిర్మలంగా ఉంచుకోవలెనని హెచ్చరిస్తూ శ్రీ హనుమత్ కాళీ వరప్రసాద బాబు (కాళీగార్డెన్సు, నంబూరు) తమ ప్రవచనమును ఈ రీతిగా ముగించారు. భగవదనుభూతికి యోగ్యత సిద్ధించేది ఆ స్థితిలోనే. *

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీబాబుకు అన్నం తినటం చేతనయ్యేది కాదు. అన్నం, కూర, పప్పు, పచ్చడి అన్నీ వడ్డిస్తే, అన్నీ కలిపేసేవారు. ముద్ద చెయ్యటం కూడా చేతనయ్యేది కాదు. “ఇదేమిటి బాబూ?”అంటే,“నాకు కాయలు, పళ్ళు, దుంపలు అలవాటు” అని చెప్పారు. సత్యవతమ్మగారు విడి విడిగా ఆధరువులతో ముద్దలు కలిపి తినిపించేవారు. శ్రీబాబుకు తల దువ్వుకోవటం, బట్టలు కట్టుకోవటం నేర్పించారు. ఆమె బాబును ‘బాబూ’ అని, ‘మీరు’ అని పిలిచేవారు. బాలుడే అయినా ఆయన తేజస్సును చూసి, ‘నువ్వు’ అని పిలవాలనిపించేది కాదు. ఇతరులతో శ్రీబాబును గురించి చెప్పేటప్పుడు మాత్రం ‘మా కృష్ణయ్య’ అనేవారు. శ్రీబాబు ఆమెను “చిన్నమ్మా” అని పిలిచేవారు.



సత్యవతమ్మగారు శ్రీబాబుపై చూపే ప్రేమను చూసి ఆశ్చర్యపడిన వారు, అపోహ పడిన వారూ కూడా ఉండే వారు. “మీ బావగారింట్లో వైద్యం కోసం, ఎక్కడి నుంచో ఎవరినో ముక్కూ మొహం తెలియని వాడిని తీసుకు వస్తే, “కందకు లేని దురద కత్తిపీటకు” అన్నట్లుగా ఆ కుర్ర సాధువును నీ యింట్లో పెట్టుకొని, అంత ఆదరణ, శ్రద్ధ చూపిస్తున్నావేమిటి?” అని అడిగే వారు. “ఏ కారణంతో ఆయన వచ్చినా, ఎవ్వరి వాడైనా, ఎవరి కోసం వచ్చిన వాడైనా, మా యింట్లో ఆయన్ని అతిథిగా ఉంచినప్పుడు మనింటికని వచ్చిన ఆ అతిథిని, అందులోనూ సాధువును దైవ సమానంగా చూసుకుని, చేతనైనంత సేవ చేసుకోమని, ఆ సేవ భగవానునికే చెందుతుందని, ‘అతిథి దేవో భవ’ అని మన భారతీయ సాంప్రదాయం చెప్పటం లేదా?” అని సత్యవతమ్మగారు బదులు పలికారు.

నూకరాజుగారి రెండో భార్యను ఆవేశించిన పిశాచము, అర్ధరాత్రివేళ కూడా పెద్ద పెద్ద కేకలు, అరుపులతో నానా అల్లరి చేసేది. ఎవరికీ లొంగేది

కాదు. ఆ గోల సత్యవతమ్మగారింట్లో ఉన్న శ్రీబాబుకు వినబడేది. శ్రీబాబు అక్కడి నుండే బిగ్గరగా "ఏయ్ ! నోరు మూసుకొని పడుకో" అని ఆ పిశాచాన్ని ఆదేశించే వారు. క్షణాలలో ఆ అరుపులు నిలిచిపోయి ఆమె నిద్రపోయేది. ఆ తరువాత త్వరలోనే ఆమెకు శ్రీబాబు కృపవలన పూర్తి స్వస్థత చేకూరింది.

శ్రీబాబు తమ పూజకు ఏర్పాట్లు చేయటం వరకే ఎవరినైనా అనుమతించే వారు. పూజా సమయంలో మాత్రం ఎవరినీ అనుమతించే వారు కాదు. తాము గ్రామాంతరం వెళ్ళినప్పుడు మాత్రం, శుచిగా దీపం వెలిగించి, నాలుగు పుష్పాలు పీఠం మీద ఉంచి, ఏదైనా పండో ఫలమో నైవేద్యం పెట్టి, హారతితో సరిపెట్టమనే వారు. దేవతార్చనను తాకవద్దని చెప్పేవారు. తరువాత కాలంలో కూడా, స్వామి ఎవరి యిళ్ళలో దేవతార్చనను ఉంచినా, యిలాగే జరిగేది.

అలాగే శ్రీబాబు ఒకసారి గ్రామాంతరం వెడుతూ శ్రీసత్యవతమ్మగారిని పై విధంగా చూసుకోమని, దేవతార్చనను మాత్రం తాకవద్దని చెప్పారు. సత్యవతమ్మగారు భయం భయంగా "తాకను లెండి బాబూ! తాకి, నాకేమన్నా అయితే, నా కోసం మళ్ళా మీరే రావాలి కదా!" అన్నారు. శ్రీబాబు నవ్వేసి "నేనెక్కడికి వెళ్ళినా మిమ్మల్ని చూసుకుంటూనే ఉంటాను కదా!"అన్నారు.

శ్రీ బాబు మాట నంగిగాను, అర్థం కాకుండాను ఉండటం చూసి, "ఎందుకల్లా ఉంది బాబూ?" అని సత్యవతమ్మగారు ఒకసారి అడిగారు. శ్రీబాబు తమ నాలుకను చాపి చూపించారు. నాలుక చివర కొనదేలి ఉండకుండా వెడల్పుగా ఉంది. " నా తల్లి, జగజ్జనని ఎందుకిలా నామాటను యిప్పుడు నంగిగా ఉంచిందో అమ్మకే తెలుసు. ఆమె ఈ నాలుకపై ఏమి వ్రాసుకుంటుందో, ఎప్పుడు, ఎలా, ఏమి పలికిస్తుందో, ఆ కరుణామయి అనుగ్రహమే" అన్నారు శ్రీ బాబు.

శ్రీబాబుకు ఎక్కెడెక్కడి నుండో , యితర దేశాల నుండి కూడా ఉత్తరాలు వచ్చేవి. "నేను లేనప్పుడు వచ్చిన ఉత్తరాలను జాగ్రత్త పెట్టండి. నేను వచ్చి చూసుకుంటాను" అనేవారు శ్రీబాబు. అలాగే తమకు వచ్చిన ఉత్తరాలన్నీ శ్రీబాబు తిరిగి రాగానే చూసుకొనేవారు. ఏభాషలలో ఆ ఉత్తరాలు వచ్చేవో, శ్రీబాబుకు ఎన్ని భాషలు వచ్చునో, అని శ్రీమతి సత్యవతమ్మగారు ఆశ్చర్యపడితే, "అమ్మకు నాకు మధ్య నడిచే భాష, భక్తి భాష ఒక్కటే చిన్నమ్మా! అది అక్షరాలలో యిమిడే భాష కాదు. ఆ భాష వస్తే అన్ని భాషలూ తెలిసినట్లే" అని అనేవారు శ్రీబాబు.

శ్రీబాబు వనమూలికలతో ఎన్నో మందులు తయారు చేసేవారు. పుటాలు పెట్టటం, సన్నికల్లులో మెత్తగా నూరటం, భస్మాలు, లేహ్యాలు, లేపనాలు, నూనెలు తయారు చేయటం, ఈ అన్ని పనుల్లో సత్యవతమ్మగారు తమకు చేతనైన సేవ చేసేవారు. ఎక్కడెక్కడి నుంచో మందుల కోసం ఉత్తరాలు వచ్చేవి. తాము లేనప్పుడు ఎవరికి, ఏ మందులు యివ్వాలో తెలుపుతూ, సత్యవతమ్మగారికి ఉత్తరాలు వ్రాసేవారు శ్రీబాబు. పిఠాపురంలోని వంగల దీక్షితులుగారు శ్రీబాబు భక్తులు. వారు మందుల తయారీ కోసము, శ్రీబాబు నివేదన కోసము, ప్రతిరోజు సత్యవతమ్మగారింటికి ఆవుపాలు పంపేవారు.

"ఇన్నాళ్ళూ ఎక్కడ ఉండేవారు బాబూ?''అని సత్యవతమ్మగారు శ్రీబాబును, వారు వచ్చిన మొదట్లో ఒకసారి అడిగారు. "నేను తపస్సు కోసం భద్రాచలంలోను, పాపి కొండలలోను, శ్రీశైలంలోను, హిమాలయాలలోను తిరుగుతూ ఉంటాను'' అని శ్రీబాబు చెప్పారు.

ఉప్పాడలో శ్రీ పోలంకి సూర్య నారాయణ గారు గొప్ప పండితులు, గాయకులు, ఘన వైద్యులు, చక్కని కవిత్వం వ్రాసేవారు. బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన శ్రీబాబును మొదటిసారిగా దర్శనం చేసుకున్నపుడు, ఆ నంగి మాటలు చూసి "ఏమున్నది లే''అనుకున్నారు. కాని సంభాషణ నడచిన కొలది శ్రీబాబులోని దివ్యత్వము, సర్వజ్ఞత్వము అవగతమైనాయి. అప్పటి నుండి చాలా తరచుగా శ్రీబాబు వద్దకు వచ్చేవారు. ఆధ్యాత్మిక విషయాలు చర్చించే వారు. చక్కగా పాటలు పాడేవారు.

శ్రీబాబు ఉన్నట్లుండి ప్రయాణమయ్యేవారు. సత్యవతమ్మగారు "మళ్ళీ ఆ కోయవాళ్ళ దగ్గరకేనా బాబూ?'' అంటే "వాళ్ళూ జగన్మాత బిడ్డలే కదా!'' అని నవ్వేసేవారు.

సత్యవతమ్మగారింట్లో శ్రీబాబు కుటుంబ సభ్యుని వలె కలిసిపోయారు. అత్యంత సన్నిహితంగా అందరితోనూ సరదాగా, ఛలోక్తులు విసురుతూ ఉండేవారు. సత్యవతమ్మగారి అత్తగారితో "నానమ్మా! మీ భోజనం అయిందా? కోడలుగారు మీకు అన్నీ అడిగి, వడ్డించి, బాగా భోజనం పెడుతున్నారా?'' అనేవారు శ్రీబాబు. "ఎందుకు పెట్టదు బాబూ? మీ చిన్నమ్మ మీ కోసం చేసినవి కూడా నాకు పెట్టి, కొసరి కొసరి వడ్డించి, తినిపిస్తుంది. వరసకు కోడలే అయినా, నా కూతురే అనుకుంటున్నాను బాబూ!''అని ఆమె బదులు పలికేవారు.

-సశేషం

# గురుమహిమ

శ్రీబాబూజీ మహరాజ్ వారితో, శ్రీ మాతాజీతో భక్తులు పొందిన అనుభవాలను మాకు పంపమని మేము లోగడ పాఠకులను కోరి ఉన్నాము. శ్రీ గురుదేవుల గురించి చెప్తూ శ్రీ మాతాజీ "రూపనామ క్రియారహితమైన శ్రీ పరమాత్మ తత్త్వమే శ్రీ సద్గురురూపం ధరించి, మానవులను ఉద్ధరించటానికి అవతరిస్తుంది. అట్టి శ్రీ గురుదేవులను ఎవరని, ఏమని, ఎంతని వర్ణించగలము? హరిహరాదులకు కూడా అందని ఆ గురుతత్త్వమును తెలిసికోవటం ఎవరికి తరమవుతుంది? దేశకాలములకు అతీతమైన గురుతత్త్వము ఏ కాలానికి , ఏ దేశానికి చెందినదని చెప్పగలము?చెప్పనూలేము, ఊహించనూలేము. కాని భాషకు భావానికీ అందని శ్రీగురుతత్వము యొక్క మధురానుభవాన్ని శ్రీ గురుకృప వలన తప్పకుండా పొందగలము" అన్నారు.

అనేక భక్తుల బాధాతప్త హృదయాలకు ఓదార్పు కలిగించి, వారి కన్నీరు తుడిచి వెన్ను తట్టి అభయమిచ్చారు శ్రీ బాబూజీ మహరాజ్.

గుంటూరు జిల్లాలోని నంబూరు గ్రామ సమీపంలో 1972లో భక్తులు నిర్మించిన శ్రీ కాళీవనాశ్రమంలో ఉంటూ తమ అవతారం చాలించే వరకూ అవిశ్రాంతంగా ఆపదలో ఉన్న భక్తులను ఆదుకుని ఉద్ధరిస్తూ, ప్రతి ఒక్కరికీ ఆత్మీయులై అందరి హృదయాలలోను "హృదయబాబు"గా నిలిచిపోయారు. భక్తులందరూ వారిని ప్రేమతో "బాబు" అని పిలుచుకొంటారు.

శ్రీబాబుతో భక్తులు పొందిన అనుభవాలను అక్షరరూపంలో పెట్టటం కష్టం. ఎందుకంటే వారి లీలలు మాటలకు అందేవి కావు. కాని అనుభవ రూపంలో భక్త హృదయాలకు అవి ఎప్పుడూ ఆనందాన్ని కలిగిస్తూనే ఉంటాయి. వారి రక్షణ భక్తులందరికీ అనుక్షణం ఈనాటికీ జరుగుతూనే ఉంది. జరుగుతూనే ఉంటుంది. శ్రీబాబు ఎందరికో ఈతిబాధలు తీర్చారు. భక్తులకు సకల భోగభాగ్యాలనూ ప్రసాదించారు. ఎన్నో, ఎన్నెన్నో ఆపదలనుండి భక్తులను కాపాడారు. మృత్యుంజయులైనవారు మరణశయ్య మీద ఉన్న భక్తులకు, 'ఇతడు మరణించాడు' అని నిర్ధారించిన డాక్టర్లు అచ్చెరువొందే విధంగా ప్రాణదానం చేసిన సందర్భాలు ఎన్నో ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. వారు చేసిన లీలలను గురించి చెప్పుకోవటం వారికి సుతరామూ ఇష్టం ఉండేది కాదు. ఒకవేళ ఎవరైనా తమకు జరిగిన మహోపకారాన్ని గురించి శ్రీ బాబుకు విన్నవించుకుంటే వారు

"ఇందులో నాదేముంది? జగన్మాత కృప చేత మీకు రక్షణ జరిగింది. నేను కేవలం పోష్టుమేనును మాత్రమే" అనో, "జగన్నాధుడు, శ్రీమన్నారాయణుడే మిమ్ములను రక్షించాడు" అనో భక్తులను మాయలో పడవేసేవారు.

శ్రీమాతాజీ మాట్లాడుతూ "వారే సాక్షాత్తు శ్రీమన్నారాయణుని అవతారమై ఉండీ వేరే లక్ష్మీనారాయణుడు ఇంకొకరెవరో ఉన్నట్లు మాట్లాడటం, భక్తులను భ్రమలో ముంచటానికే" అని ఎన్నో మార్లు అన్నారు.

భక్తులను శ్రీబాబు "గురుపాదుకలు మిమ్ము రక్షించుగాక!" అని దీవించేవారు. శ్రీబాబు తమ సర్వశక్తులను శ్రీ మాతాజీవారికి ధారపోసి 1988 డిసెంబరు 3వ తేదీన తమ వ్యక్త శరీరాన్ని ఉపసంహరించి సమాధిస్థితులైనారు. అప్పటినుండి పూజ్య యోగిని శ్రీచంద్రకాళీ ప్రసాద మాతాజీ పూర్ణాధికారిణియై, పీఠాధిపత్యం స్వీకరించి, తమ గురుదేవుల పంథానే అనుసరిస్తూ నిర్విరామంగా భక్త రక్షణ చేస్తూ ఉన్నారు.

ఇప్పుడెవరికైనా రక్షణ జరిగి వారు శ్రీ మాతాజీతో విన్నవించుకుంటే శ్రీ మాతాజీవారు కూడా "ఈ బొమ్మదేముంది శ్రీ గురుదేవులు మిమ్ములను రక్షించారు" అంటారు.

ఏతావాతా దీనిని బట్టి తేలేది ఏమిటంటే గురుశక్తియే ఆనాడు శ్రీబాబు రూపంలోనూ, ఈనాడు శ్రీ మాతాజీ రూపంలోనూ భక్తులను రక్షిస్తున్నదని. ఇది నిర్వివాదాంశం అని భక్తులందరూ అంగీకరిస్తారు.

ఆనాడు శ్రీబాబు చేసిన లీలలను, ఈనాడు శ్రీ మాతాజీవారి లీలలను, వారు భక్తులను కంటికి రెప్పలాగా కాపాడటమేకాక అంత్యకాలంలో దృష్టి భగవంతునిపై నిలిపి గురుసాయుజ్యం పొందేటట్లు చేసిన ఉదంతాలను, మా ప్రార్థనను మన్నించి, భక్తులు తాము పొందిన అనుభవాలను మాకు వ్రాసి పంపుతున్నారు. వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ సంచికలో, ఏప్రిల్ నెలలో శ్రీ మాతాజీవారు చంపక (సుభద్ర) అనే భక్తురాలిని అనుగ్రహించి ఎలా తమలో లీనం చేసుకున్నారో ప్రత్యక్ష సాక్షులైన భక్తుల కథనాన్ని 'నీవు వినలేని పిలుపే లేదు' అనే శీర్షిక క్రింద, మే నెలలో శ్రీ కురిశేటి నాగేశ్వరరావుగారిని అనుగ్రహించి తమలో లీనం చేసుకున్న సంఘటనను 'ప్రయాణకాలేzపి చ మాం తే విదుర్యుక్త చేతసః' అనే శీర్షిక క్రింద ప్రచురిస్తున్నాము. ఈ శీర్షికలు చదివిన తరువాత పాఠకుల భక్తి తప్పక ఇంకా దృఢం అవుతుందని భావిస్తున్నాము.*

-ఎడిటర్

# నీవు వినలేని పిలుపే లేదు

శ్రీ సద్గురుదేవులను సేవించుకొనే అరుదైన అదృష్టం ఎన్నో జన్మల పుణ్యం రాసీభూతమైన ఏ కొద్దిమంది భాగ్యశాలులకో మాత్రమే లభిస్తుంది. శ్రీ బాబూజీ మహరాజ్ భీమరం తాతయ్య (కీ.శే పాలూరి శ్రీరామమూర్తిగారు) గారి ఇంటికి ప్రప్రథమంగా వెళ్ళినప్పుడు, స్వామిని సేవించుకొనేభాగ్యం, సుభద్ర, శారద అనే ఇద్దరు పాపలకు లభించింది. ఒకరోజు శ్రీ బాబు సుభద్రను పిలిచి ఇకనుంచి నిన్ను 'చంపక' అని పిలుస్తాను అన్నారు. అప్పటినుండి ఆమె అందరికీ 'చంపక' అయింది. చంపక భీమవరం తాతయ్యగారింట్లోనే పుట్టి, పెరిగి వారింటి కోడలైంది. శారదను స్వామి రోజా అని పిలిచేవారు.

చంపక జన్మ సంస్కారం ఎంత గొప్పదో, ఆమెకు నిరంతరం స్వామిని అనుసరించి ఉంటూ, వారిని సేవించుకొనే మహాభాగ్యం కలిగింది. ఆమె శ్రీ బాబును ఒక చంటిపిల్లవాడిగా చూసుకున్నది. 'చంపకా!' అని శ్రీబాబు కంఠం వినిపిస్తే చాలు, ఎక్కడ, ఏ పనిలో ఉన్నా క్షణంలో స్వామి సన్నిధిలో వచ్చి వాలేది. స్వామి మనసెరిగి, స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు దర్శనానికి అవకాశం కల్పించేది. కాలాన్ని పట్టించుకోకుండా గురుమూర్తిని అన్నివిధాల సేవించుకొన్నది.

ఒకనాడు శ్రీ బాబు ఎక్కడికో ప్రయాణమైనారు.అలవాటు ప్రకారం చంపక కూడా వెంట ఉన్నది. గురుదేవులు కారులో ఎక్కి డోర్ మూసే సమయంలో వారి చేతి వ్రేలు డోర్ సందులో పడి నలిగి రక్తం కారసాగింది. వెంటనే మరోఆలోచన లేకుండా చంపక తను ధరించిన చీరను చింపి స్వామి వేలుకు కట్టు కట్టింది. స్వామితో పాటు ప్రయాణమై వెళుతున్న ఆమెకు ఆ వెళ్ళేచోట కట్టుకోవటానికి కేవలం మరొక్క చీర మాత్రమే సంచిలో ఉన్నది. అప్పుడే శ్రీ బాబు చంపకకు అభయం ఇచ్చారు, 'నీకు ఏనాడూ, ఏ లోటూ రాకుండా నేను చూసుకుంటాను' అని. సత్యవాక్పాలకులైన శ్రీ బాబే చంపక వివాహం జరిపించారు. కాలం గడిచేకొద్దీ శ్రీ బాబు కృప వలన అనుకూలుడైన మంచి భర్త, సత్సంతానం, సిరిసంపదలతో తులతూగుతూ చంపక జీవితం సుఖ సంతోషాలతో గడచి పోతున్నది. ఒకసారి శ్రీ గురుదేవులు చంపకకు అతి రహస్యంగా ఒక మహామంత్రాన్ని అనుగ్రహించారు. ఏజీవికైనా మోక్షం లభించాలంటే ప్రారబ్ధం పూర్తిగా అనుభవించక తప్పదు. ప్రారబ్ధ కర్మ వలన చంపక అస్వస్థురాలైంది. అయినా,ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నా ఆమెకు దాని బాధ తెలియలేదు.

చివరకు ఆమె ఆరోగ్య స్థితి ఆందోళనకరంగా మారటంతో చంపకను భీమవరంలో గంగాధర్ హాస్పటల్‌లో చేర్పించారు. డాక్టర్లు ఆమెను వెంటనే ఐ.సి.యు (I.C.U)కు తరలించి అవసరమైన పరీక్షలన్నీ గబగబా ముగించి ఆమె ఇక మూడు గంటలకంటె బ్రతకదని నిర్ధారించారు. వారు చంపక బంధువులతో విషయం చెప్పి కావలసిన వాళ్ళందరికీ కబురు చేసుకోమని చెప్పారు. చంపక దంపతుల కొడుకు శ్రీ రామకృష్ణ ప్రసాద్ లండన్‌లో ఉన్నాడు. కబురందగానే కనీసం అంత్యక్రియలకైనా అందుకోగలనా అని సందేహిస్తూనే అతడు వెంటనే ఫ్లైట్‌లో ఇండియాకు వచ్చి హుటాహుటి భీమవరం చేరుకున్నాడు.

చంపక గ్రహణ శక్తి, వినేశక్తి, చూసేశక్తి, మాట్లాడే శక్తి ఇలా ఒక్కొక్క శక్తి క్రమంగా క్షీణించిపోతున్నాయి. శ్రీబాబు చంపకకు ఇచ్చిన వాగ్దానం మరువలేదు. ఆ గురుకృప వలననే చంపక ఆ సమయంలో తన ప్రాణశక్తిని అంతటినీ కూడదీసుకొని శ్రీబాబు ప్రసాదించిన మహామంత్రాన్ని లోలోనే జపిస్తూ గురు దేవులను తలుచుకున్నది. ఆ పిలుపు గురుదేవులకు వెంటనే అందింది. గురుదేవులు కనరాని చోటు, వినలేని పిలుపు లేవు గదా!

**29.04.10** ఉదయం 9గం.30ని. అయింది. చంపక గురుదేవులను స్మరిస్తూ ఆ మూర్తినే మనస్సులో నింపుకొని కోమాలోకి వెళ్ళిపోయింది. చంపకకు అంతిమ క్షణాలు సమీపిస్తున్నాయి. ' తనను ఆశ్రయించిన ప్రతిజీవిని తరింపచేస్తాను' అని అభయం ప్రసాదించిన సత్యగురుదేవులు ఊరుకుంటారా? శ్రీబాబుకు పిలుపు అందటమే ఆలశ్యం, శ్రీ మాతాజీవారు ఆఘమేఘాలమీద భీమవరం చేరుకొనిగంగాధర్ హాస్పటల్‌లో అడుగు పెట్టారు. శ్రీ మాతాజీవారితో భాస్కర సోమరాజుగారు, జనార్దనప్రసాద్, గురుసోదరులు పరాశరప్రసాద్, ఇంకా రమణ ప్రసాద్‌గార్లు ఉన్నారు. అప్పటికే భీమవరంలోని ప్రముఖులు, శ్రీ గురుదేవుల భక్తులు అయిన శివగారికి, సూర్యనారాయణ గుప్తా గారికి వెంటనే హాస్పటల్‌కు చేరుకోమని ఫోన్‌కాల్స్ వెళ్ళాయి.

శ్రీమాతాజీ చూశారు. ఇక టైమ్ లేదు. తాము చేయవలసింది క్షణాలమీద జరిగిపోవాలి. అమ్మ శివగారికోసం, గుప్తాగారికోసం ఆగలేదు. హాస్పటల్ స్టాఫ్‌ను 'ఐ.సి.యు ఎక్కడ? అని అడిగారు. వారి సమాధానం పూర్తి అయ్యే లోపలే అమ్మ ఒక్క అడుగులో ఐ. సి.యులో చంపక ప్రక్కన ఉన్నారు.

-సశేషం

# ప్రయాణకాలే z పి చ మాం విదుర్యుక్త చేతసః

- సూర్య నారాయణ గుప్త

ఆ రోజు నేను జీవితంలో మరచిపోలేని రోజు. ఏప్రిల్ 8వ తారీఖు. నేను మహారాష్ట్రలో మా గురు ప్రభ పవర్ లిమిటెడ్ కంపెనీ ఆఫీస్‌లో ఉన్నాను.

సాయంత్రం సుమారు 6గం॥30.నిలు అవుతున్నది. ఆ రోజు ఆఫీసు పనిని ముగించి, మర్నాడు ఎవరెవరికి ఏయే పనులు పూర్తి చెయ్యాలని చెప్పాలో. ఇంకా కొన్ని మిగిలిపోయిన వ్యవహారాలను ఎలా టై అప్ (tie - up) చెయ్యాలో, ఇంకా కీలక విషయాలలో తీసుకోవలసిన విషయాలను గురించి దీర్ఘంగా ఆలోచిస్తున్నాను. ఫోన్ మ్రోగుతున్నట్లున్నది. అది ఎప్పటినుంచి అలా మ్రోగుతున్నదో! ఆలోచనలు తెగటంలేదు. పోనీ వదిలేద్దామా అనుకున్నాను. కానీ ఏదో శక్తి బలవంతంగా ఫోన్ ఎత్తేలా చేసింది. ఫోన్ భీమవరం నుంచి.

వారంరోజులక్రితమే మామామగారిని భీమవరం హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. మా మామగారి నామధేయం కురిశేటి నాగేశ్వరరావుగారు. కురిశేటి నాగేశ్వరరావుగారిని గురించి భీమవరంలో తెలియని పెద్దలు ఎవరూ ఉండరు అంటే అతిశయోక్తి కాదు. వారి కుటుంబం కేవలం సంపన్న కుటుంబమేకాదు, అక్కడ ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించిన ముఖ్యమైన కుటుంబాలలో ఒకటి. అక్కడి ప్రముఖ రైస్‌మిల్లర్లలో శ్రీ నాగేశ్వరరావుగారు ఒకరు. అంతేకాదు, వారు చాలాకాలం అక్కడి రైస్ మిల్లర్స్ ఛాంబర్స్‌కు అధ్యక్షులుగా పని చేశారు. వారు భగవద్భక్తి పరులేగాని, వారికి ఇంకా అప్పటికి, గురు సంప్రదాయాన్ని గురించిగాని, ఒక గురుదేవుని, లేదా మహాత్ముని పాదాన్ని ఆశ్రయించటంగాని ఏమీ తెలియదనే అనుకోవాలి. అలా అని మహాత్ములను, సాధు పురుషులను వారు ఏనాడూ తక్కువగా చూడలేదు. కాని వారి అంతరంగంలో గురుదేవులంటే ఎటువంటి భావం ఉన్నదో, ఎటువంటి గురుభక్తి ఉన్నదో, పైకి మా కెవ్వరికి తెలియనిచ్చేవారు కాదు. గురుదేవులకు, మా మామగారికి మధ్య ఉన్న అతి నాజూకైన అనుబంధం గురించి, వారిద్దరికే తెలుసు. వారి బాహ్య ప్రవర్తనను చూసి శ్రీ బాబూజీ మహరాజ్ గురించి, వారికి తెలిసిందల్లా, 'శ్రీబాబు ఒక గొప్ప కాళీమాత ఉపాసకులు అని, వారిని నమ్మిన వారి భారం తాము వహించి వారిని ఉద్ధరిస్తారని మాత్రమే' అని మేము అనుకునే వాళ్ళం. మేము శ్రీ మాతాజీవారి

దర్శనం చేసుకోవటానికి ఆశ్రమానికి తరచూ వెళ్ళి వస్తుండేవారము. వారు కూడ అప్పుడప్పుడు మాతో ఆశ్రమానికి వస్తూ ఉండేవారు.

సుమారు గత రెండు సంవత్సరాలుగా వారు లివర్ సమస్యతో బాధ పడుతూ వైద్యం చేయించుకుంటున్నారు. దాన్నలా ఉంచితే, అదే కాలంలో పూజ్య యోగిని శ్రీచంద్రకాళీ ప్రసాద మాతాజీ వారి (ఇకనుంచి వారిని మాతాజీ అని పిలుస్తాను) రెండు లీలలకు వారు ప్రత్యక్ష సాక్షిగా ఉండటం సంభవించింది. బహుశ అది కూడ తప్పక మాతాజీ వారి లీలలో భాగం అయి ఉంటుంది. మొదటిది శ్రీ మాతాజీ మా మామగారి ధర్మపత్నికి అంతిమ గడియలలో మోక్షాన్ని ప్రసాదించి తమలో ఐక్యం చేసుకున్నది. రెండవది సంవత్సరమైనా తిరక్కుండానే మృత్యుకోరలలో చిక్కుకున్న నా సతీమణి (వారి కుమార్తెని) యమపాశం నుండి రక్షించిన సంఘటన. ఆనాటి నుండి వారికి గురుశక్తిపైన, ఆ గురుతత్వం యొక్క ఒక సుదుర్లర్భ రూపమైన శ్రీమాతాజీ పాదపద్మములయందు అచంచలమైన దృఢ విశ్వాసం కలిగింది. కాని ఆయన చాలా గంభీరంగా కనిపిస్తూ, తమ విశ్వాసాన్ని ఎప్పుడూ బయటకు తెలియనిచ్చేవారు కాదు.

దాదాపు ఒక సంవత్సరం క్రితం శ్రీమాతాజీని మా మామగారు తమ ఇంటిని వారి పాదధూళితో పవిత్రం చేయవలసిందిగా ప్రార్థించారు. మాతాజీ 'ఏవేవి జరగాలో అవన్నీ నిర్ణయ కాలంలో జరిగేలా గురుదేవులు తప్పక చూసుకుంటారు అని వారిని అప్పటికి సమాధాన పరిచారు. బహుశ ఆ నిర్ణయ కాలం మార్చి 27వ తేది అయి ఉంటుంది. అందుకే ఆరోజు శ్రీ మాతాజీ ఎవ్వరితో చెప్పకుండా,సిరికింజెప్పడు అన్నట్లుగా మా మామగారింటికి వెళ్ళి వారికి తమ దర్శన భాగ్యాన్ని ప్రసాదించారు. ఆనుకోని ఈ మహద్భాగ్యానికి మా మామగారు అంతవరకు ఏ సిరిసంపదలు, భోగభాగ్యాలు ఇవ్వలేని ఒక అలౌకికమైన ఆనందాన్ని పొందారు. పరమానంద భరితులైన వారు శ్రీ మాతాజీతో తమ జీవితంలో అంతవరకు తీరకుండా మిగిలిపోయిన ఒకే ఒక్క కోరిక కూడ తీరిపోయిందని, తమకు ఏ కోరిక లేదని, ఇక ఈ లోకంలో జీవించాలనిపించటం లేదని చెప్పి తన ధర్మపత్నికి మోక్షాన్ని ప్రసాదించినట్లే, తనకు కూడ మోక్షాన్ని ప్రసాదించమని ఎంతో వినయంగా ప్రాధేయ పడ్డారు. అమ్మ (శ్రీమాతాజీ) సమాధానం ఒక్కటే. 'విచారించకండి. నిర్ణయకాలంలో అది కూడ తప్పక జరిగి తీరుతుంది' అని. -సశేషం




(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

నేను అటూ ఇటూ చూశాను. తండ్రి ఉగ్రసేనుడూ ఇతర శ్రేష్ఠులు కొంచెం దూరంగా ఉన్నారు.... ఇలా ఏకాంతం కుదరటంతో నాకు 'దేవర్షి నా తల్లి పవనరేఖ క్షేమ సమాచారం ఉగ్రసేనుని అడగకుండ నన్నే ఎందుకు అడిగాడు?' అనే ఆలోచన వచ్చింది.

'దేవర్షీ! మాత పవనరేఖ బయటకు రావటమే లేదు. అందరితో కలవటం లేదు. ఎప్పుడూ ఒంటరిగా ఉంటోంది. ఆమె చేయని ఏ తప్పుకో అందరూ తనను నిందితురాలిని చేసి చూస్తున్న భావంతో, ఎవరితో పంచుకోలేని ఏదో దుఃఖంతో తనలో తాను క్రుంగి క్రుశించిపోతున్నది.ఇది ఎలా సంభవించింది? ఇలా పతి నిరాదరణకు గురై, పరమ పతివ్రత అయిన నా తల్లి ఎన్నాళ్ళు ఒంటరితనం అనే నరకాన్ని భరిస్తూ జీవించాలి?' అని నారదుని అడిగాను.

'వ్రజభూమి పరువు ప్రతిష్ఠలకు, పాతివ్రత్య ధర్మానికి అభాగ్యురాలైన నీ తల్లి వలన ఆమెకు తెలియకుండానే జరిగిన మర్యాదోల్లంఘనానికి ప్రాయశ్చిత్తంగా ఆమె జీవితాంతం ఈ కర్మఫలాన్ని అనుభవించటం కన్న వేరే మార్గం లేదు నాయనా!' బాధగా అన్నాడు నారదుడు.

'దేవర్షీ !'నేను నారదుని చరణాల వద్ద కూర్చున్నాను. నారదుడు నా శిరస్సుపై తన హస్తాన్ని ఉంచి అన్నాడు, 'నీ జననమరణాలను కాలుడు ఈ విధంగా నిర్ణయించి ఉన్నాడు నాయనా...'

నారదుడు నాకు నా తల్లి వ్యధాపూరితమైన గాథను వినిపించాడు. దుర్మిలుడి పాపాచరణంయొక్క ఫలితంగా నేను పుట్టాను. దీనిని ఉగ్రసేనుడు ఎన్నడూ మరవలేదు. వ్రజభూమి యాదవులూ మరవలేదు. నా ఆధిక్యాన్ని అందరూ స్వీకరించారు కాని అది హృదయపూర్వకంగా ఆమోదించి కాదు, గత్యంతరం లేక! నా శరీరం అగ్నిలో కాల్చిన రాగిలాగ తపించింది. నా శరీరంలోని అణువణువు అగ్నిలాగా దహించసాగింది...

'ఇంకా విను వత్సా!' తన మాటలను పూర్తి చేస్తూ అన్నాడు నారదుడు, 'నీ దశ గురించినది కూడా విను! దుర్మిలుని చేత వంచించబడిన నీ తల్లి పవనరేఖ దుర్మిలుడిని గుర్తించగానే ఆమెలోని సతీత్వం జాగృతమైంది... పరస్త్రీ పొందుతో తృప్తిపొందిన దుర్మిలుడు పవనరేఖతో "సుందరీ! మన ఈ సమాగమ ఫలితంగా నీ కడుపున ఒక మహా ప్రతాపవంతుడైన పుత్రుడు జన్మిస్తాడు" అన్నాడు. అది విని నీ తల్లి క్రోధంతో ఊగిపోయింది. ఆమెలోని ప్రతి అణువు దహింపబడుతోంది. తన ఈ దురవస్థకు కారకులైన అందరినీ దహించాలని అనిపిస్తోంది. ఆమె 'దురాత్మా! నీ నీచ ప్రవృత్తి ,అధమాచరణవల్ల జన్మించబోయే నీ అంశం అయిన పుత్రుని నాశనం చేయగల సమర్థుడు, మహాబలశాలి అయిన యాదవుడు నా వంశంలో ఉద్భవిస్తాడు. యాదవ కులం నీ ఈ అపవిత్ర అంశను ఎన్నటికి ఆదరించదు...' అని శపించింది.

'నారదుడు తన మాటలు పూర్తి చేసేలోపలే నా మనస్సులో తండ్రి ఉగ్రసేనునితో సహా సమగ్ర గణతంత్రమే కాక మధుర నగరవాసుల పట్ల అత్యంత ధిక్కార క్రోధ భావాలు చెలరేగాయి... నేను అప్పటికప్పుడే ఒక నిర్ణయం తీసుకున్నాను. ఈ ఉగ్రసేనుడు, ఈ గణతంత్రం, ఈ పురవాసులు.... ఈ సమగ్ర యాదవ పరివారం... వీరిలో ఎవ్వరికీ నన్నుగాని, నిరపరాధి అయిన నా తల్లినిగాని ఉపేక్షించే అధికారం ఏనాడూ లేదు.... ఎప్పుడూ లేదు. నేను నా బాహుబలంతో వీరందరినీ నామరూపాలు లేకుండా చేస్తాను. చేసి.... నా తల్లి ఆక్రోశానికి కారణమైన వీరినే కాక, భవిష్యత్తులో నా మృత్యువుకు కారకుడైన ఆ యాదవుణ్ణి కూడా పట్టుకుని మట్టుపెడతాను... కాని మృత్యువు యొక్క నిర్ణయాన్ని నేను మార్చలేకపోయాను కృష్ణా !...' ఎంతో రక్తం కారిపోవటంచేత మృత్యుముఖంలో ఉన్న కంసుని పాలిపోయిన ముఖంపైన ఒక నిర్జీవమైన నవ్వు కనపడీ కనపడనట్టు కనిపించింది. గ్రహణం పట్టిన సూర్యుని నుంచి వచ్చే క్షీణమైన ప్రకాశం లాగా ఉంది ఆ నవ్వు....

కృష్ణుడు ఇదంతా వింటున్నాడు.... మూసిన పుస్తకం నుంచి ఒక్కొక్క పుట తెరుచుకుంటున్నట్లుగా ఉంది.... తాను వింటున్నాడు. అతని వదనం కరుణార్ద్రం అవుతోంది. కంసునికి ఇటువంటి వినాశమా!.... మహా బలవంతుడు, అతి ప్రతాపవంతుడైన ఈ కంసునిపైన తన విజయం కూడా తనకు ఒక ఓటమిగ తోచింది. ఇతని జన్మకు పూర్వమే ఒక అసహాయురాలైన అబల ఆక్రోశానికి ఫలితంగా ఇతని జన్మ అని విధి నిర్ణయించి ఉంచింది...

ఇక తాను... స్వయంకృష్ణుని నిర్మాణం కూడా పవనరేఖ శాపకారణంగా ఆ క్షణమే జరిగిపోయింది ఈ రోజు జరిగిన ఈ నిమిత్త మాత్ర సంఘటనకి నిమిత్తుడు తానే అయ్యాడు. ఈ సత్యం కృష్ణుడిని కంసుని పట్ల ఎంతో వినమ్రునిగ చేసింది.

'ఇప్పుడు నువ్వే చెప్పు కృష్ణా!' కంసుడు క్షీణ స్వరంతో ఆగి ఆగి అన్నాడు. 'నిన్ను సమర్థించిన సమాజం ఒక నిర్దోషురాలైన స్త్రీని జీవన ప్రవంతి నుంచి బహిష్కృతురాలిని చేసింది. అటువంటి సమాజంలోని నిర్వీర్యులైన నాయకులకు శాసించే హక్కు ఎక్కడ ఉంది? నా తల్లి చేసిన అపరాధమేమిటి? చెప్పు కృష్ణా.... చెప్పు?... ఆమె గర్భాన జనించిన ఈ కంసుడు ఏ అపరాధం చేశాడు? దీనికంతటికీ కారణమైన పాపాత్ముడు, భ్రష్టుడు అయిన ఆ దుర్మిలుని శిక్షించక ఈ భీరువులు సాంస్కృతిక విలువల పేరు మీద నైతికత నెపంతో తమ వైరాగ్నికి నిర్దోషి అయిన ఒక అబలను ఎందుకు బలి చేశారు?..."

'మామా!' కృష్ణుడు ఎంతో కోమల స్వరంతో అన్నాడు. వ్యక్తికి న్యాయం చేకూర్చగలిగితేనే, అతనికి సంరక్షణ కల్పించగలిగినప్పుడే సమాజం శక్తివంత మవుతుంది. అదే కళ్యాణమార్గం... కాని.... కాని... వ్యక్తి కూడా సమాజంలోని ఒక అంశమే కదా! సమాజానికన్న దాని అంశమైన వ్యక్తి ఎలాముఖ్యమవుతాడు? ఒక పిరికి సమాజంపై ప్రతీకారం తీర్చుకోవటం కోసం మీరు గణతంత్రాన్ని నాశనం చేశారు.... యాదవకులంపై మీరు మీ ఏకాధికార శాసనాన్ని ప్రకటించారు....."

"గణతంత్రం?.... ఏ గణతంత్రం కృష్ణా?"కంసుని స్వరంలో తిరస్కార భావం ఉంది. "ఒకరిద్దరు ఉగ్రసేనులో, ఒకరిద్దరు వసుదేవులో ఉన్న గణతంత్రమా?... లేక ఒకరిద్దరు అక్రూరులు ఉన్న గణతంత్రమా?.... తామే ఎల్లకాలం అధికారంలో ఉండాలని న్యాయాన్ని హత్య చేసేవారు, అధికారాన్ని వదలటానికి ఇష్టపడక పదవులను పట్టుకొని వేళ్ళాడేవారు, వేళ్ళమీద లెక్కపెట్టటానికి వీలైన ఇటువంటి భీరువుల ఆసరాతో నిలబడే గణతంత్రమా?.....

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,